జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

కృష్ణ | శనివారం 31 అక్టోబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :286 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

- యూసీసీ అమలు చేస్తాం
- 30 ఏళ్ల వరకు ఎస్పీకి అధికారం లేదు
- రామభక్తులపై కాల్పులను గుర్తుచేసిన షా
- ఓటు చోరీపై చర్చకు సిద్ధం
- యూసీసీపై దేశవ్యాప్త చర్చ

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ దేశాయ్ నియామకం
- ఇరుపక్షాల అంగీకారంతో నిర్ణయం
- పరిష్కారానికి నిపుణుల సహకారం
- మధ్యవర్తిత్వానికి పూర్తి సహకారం
- నాలుగు వారాల తర్వాత సమీక్ష
- విచారణ నిలిపివేతకు గతంలో నిరాకరణ

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

- 36,351 మందితో బందోబస్తు
- 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

అమరావతి

నవంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని - మిగతా3లో

తుపాను బాధితుల కష్టం తెలుసు..

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- సీఎం చంద్రబాబు భరోసా
- పశ్చిమగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల

అమరావతి

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను - మిగతా3లో

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

- ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- బద్రీనాథ్ నుంచి బయలుదేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్

నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు

- 30న తుది ఓటర్ల జాబితా
- ఈసీ తాజా ఉత్తర్వులు జారీ
- వివేక్ యాదవ్ వెల్లడి
- ఆరు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్
- అధికారుల అభ్యర్థనతో గడువు పెంపు
- ఢిల్లీకి డిసెంబర్ 22 వరకు గడువు
- దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ తుది దశ

అమరావతి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నవంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో సర్ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. సర్ - మిగతా3లో

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- 2.6 శాతానికి తీవ్ర పేదరికం.. ఉపాధితో తగ్గిన పేదరికం
- సంక్షేమ పథకాలతో ఊరట.. 2028 నాటికి మరింత తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి.. వీడని ఆదాయ అసమానతలు

మత్స్యకారుల సమస్యలపై చర్చ

- పడవలకు బీమా కల్పించే యోచన
- నష్టంపై పవన్ కల్యాణ్ సమీక్ష
- ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం
- కాకినాడలో విద్యుత్ అంతరాయం
- ఉప్పాడలో భారీగా తీర కోత
- బీచ్ రోడ్డు ధ్వంసం.. రాకపోకలు బంద్
- 54,435 హెక్టార్లలో పంట నష్టం
- 21 మండలాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

అమరావతి

అర్నబ్ తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జరిగిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ పాల్గొన్నారు. జిల్లాలో తుపాను వల్ల జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. "తీరప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి. వేట పడవలకు బీమా కల్పించే అంశంపై ప్రతిపాదనలు - మిగతా3లో

జనవరి 25 నుంచి జనగణన

- ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మినహాయింపు
- మార్చి 1 అర్ధరాత్రి కీలక గడువు
- జనవరి 10 నుంచే స్వీయ నమోదు
- రెండు దశల్లో జనాభా లెక్కింపు
- జనగణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు
- కరోనా కారణంగా ఐదేళ్లు ఆలస్యం
- చివరిసారిగా 2011లో జనాభా లెక్కింపు

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- చివరి శ్వాస వరకు ప్రజాసేవ.. దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- ఎరువులు, గ్యాస్‌పై దుష్ప్రచారం.. రైతులపై ధరల భారం పడనివ్వం
- రైతు సంక్షేమమే లక్ష్యం.. పీఎం-కిసాన్‌కు రూ.4.5 లక్షల కోట్లు
- బనాస్కాంత రైతులపై ప్రశంసలు.. పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం

నందిగామలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరు!

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణుల సమాయత్తం

ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమైన మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలం నందిగామ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించింది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి నాయకత్వంలో గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగులపల్లి ధనలక్ష్మి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనలో వివిధ వర్గాలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రస్తావిస్తూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సమష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టిడిపి : ఇన్చార్జ్

గోపవరం అక్టోబర్ 30. ప్రజా జ్యోతి న్యూస్....,. గోపవరం మండలం టిడిపి పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి దాసరి చిన్నమ్మ ప్రచారంలో కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి గోపవరం మండల టిడిపి అధ్యక్షులు సుధాకర్ రెడ్డి . వేణు రెడ్డి టిడిపినాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

--డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు.
--బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు.
-- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.
--ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్.

మోతిగూడెం ప్రజాజ్యోతి అక్టోబర్ 30 : పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం మత్తులో వాహనాలు నడపడంపై కఠిన చర్యలు తీసుకుంటామని మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఇప్పటికే మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా, ఇతరులకు సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అలాగే బహిరంగ ప్రదేశాల్లో, రహదారుల పక్కన మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపైనా, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు.ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మద్యం పంపిణీ చేసినా, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం వినియోగించినా, అక్రమంగా మద్యం నిల్వ చేసినా లేదా విక్రయించినా సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని, అక్రమ మద్యం విక్రయాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ కోరారు.

తుఫాన్ గాలులకు నేలకొరిగిన 600 అరటి చెట్లు, ఆర్నెల్ల కష్టమంతా ఆవిరి.. కౌలు రైతుకు రూ.లక్ష నష్టం

ఆలమూరు అక్టోబర్ 30(ప్రజాజ్యోతి):అర్నబ్ తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు అరటి తోట నేలకొరగడంతో ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన కౌలు రైతు తోరాటి సుబ్బారావు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు తుఫాన్ రూపంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. సుమారు ముప్పావు ఎకరం కౌలు భూమిలో కూర అరటి సాగు చేపట్టిన సుబ్బారావు, మొక్క తోట కావడంతో అధిక పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. కౌలు భూమికి శిస్తు, సాగు ఖర్చుల కోసం అప్పులు చేసి మరీ పంటను సాగు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో అరటి గెలలు తయారై చేతికొస్తాయనుకున్న తరుణంలో తుఫాన్ ఈదురుగాలులు తన ఆశలపై నీళ్లు చల్లాయని వాపోయారు. తోటలో సుమారు 600 అరటి చెట్లు ఉండగా, తుఫాన్ గాలుల ధాటికి గెలలు వచ్చే దశకు చేరకముందే చెట్లన్నీ నేలకొరిగాయని తెలిపారు. దీంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యారు.తనతో పాటు భార్య, కుమారుడు, కోడలు, మనవడు, మనవరాలు జీవనాధారం ఈ వ్యవసాయంపైనే ఆధారపడి ఉందని, పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతు కావడంతో పాటు పంట నమోదు ప్రక్రియపై అవగాహన లేక ఈ-క్రాప్ నమోదు చేయించుకోలేకపోయానని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, క్రాప్ డ్యామేజ్ నమోదు చేయాలని, నష్టపోయిన అరటి పంటకు తగిన పరిహారం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని నిరుపేద కౌలు రైతు తోరాటి సుబ్బారావు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు

పేదల ఆకలి తీర్చడమే నిజమైన సేవా స్ఫూర్తి!

నిరుపేదలకు ఏబీ ఫౌండేషన్ అండ.. పైడిగూడెంలో 30 కొండరెడ్డి కుటుంబాలకు అన్నదానం

ఏబి ఫౌండేషన్ సేవ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఏ పీ డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె. ఇంతియాజ్

కూనవరం, అక్టోబర్ 30. (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపడమే మానవత్వానికి నిజమైన ప్రతిరూపమని, ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడమే సమాజానికి చేసే గొప్ప సేవ అని ఏ పీ డబ్ల్యు జే ఎఫ్,జిల్లా ఉపాధ్యక్షుడు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఎస్.కె. ఇంతియాజ్ పేర్కొన్నారు. పోలవరం జిల్లా కూనవరం మండలం పైడిగూడెం గ్రామంలో ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 కొండరెడ్డి కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.కె. ఇంతియాజ్ మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చేందుకు ఏబీ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ, సేవా భావంతో ముందుకు సాగడం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు.ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్ ఆదేశాలతో.. ఈరోజు ఈ కార్యక్రమం జరిగింది "కడుపు నిండిన వారికి ఆకలి విలువ తెలియదు.. ఆకలి వేసినవాడికే అన్నం విలువ తెలుస్తుంది" అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని ఏబీ ఫౌండేషన్‌ను ప్రారంభించామన్నారు. నిరుపేదల కష్టాల్లో భాగస్వాములై, వారికి చేతనైనంత సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్నపాటి సహాయం సైతం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్ బాబు, తోడం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

ఆయిల్ రోటరీ స్ట్రీట్ లక్కిరెడ్డిపల్లి గ్రామంలో-- ప్రజలకు మలేరియా, డెంగ్యూ జ్వరములపై అవగాహన

లక్కిరెడ్డిపల్లి అక్టోబర్ 30 ప్రజా జ్యోతి అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా, దేవలంపల్లి పి హెచ్ సి పరిధిలోని ఆయిల్ రోటరీ స్ట్రీట్ లక్కిరెడ్డిపల్లి గ్రామములో ఫ్రైడే డ్రై డే నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలకు మలేరియా మరియు డెంగ్యూ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం గురించి అవగాహన కల్పించారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి తొట్టెలు, డ్రమ్ములు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు కూలర్స్ ఫ్రిడ్జ్ తదితర వాటిలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వారానికి ఒకరోజు తమ ఇంటి పరిసరాలను పరిశీలించి దోమల పెరుగుదలకు అవకాశం లేకుండా డ్రై డే పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి. జయరామయ్య ఆరోగ్య కార్యకర్తలు వై రాజేంద్రప్రసాద్ బేబీ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రంగా టీడీపీ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని పూలుకుంట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బోరెడ్డిగారిపల్లి గ్రామంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి ఇంటింటి ప్రచారం కొనసాగించారు. అలాగే పూలుకుంట ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి పూజారి అంజనమ్మ కూడా వారితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ, జడ్పీటీసీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు, ఎంపీటీసీ అభ్యర్థి పూజారి అంజనమ్మకు మద్దతుగా ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గొల్లప్రోలులో ఎన్నికల విధుల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

గొల్లప్రోలు ప్రజా జ్యోతి రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026 లో భాగంగా గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్ను ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు పట్టణంలో ఓటు హక్కు కలిగి ఉండి, ప్రస్తుత ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

గుబ్బల కుమార్ కుమారుడు ప్రేమ్ చరణ్ ను పలకరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి మురళిరాజు

కాకినాడ జిల్లా అక్టోబర్ 30(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ప్రత్తిపాడు మండలం ధర్మవరంకి గ్రామానికి చెందిన గుబ్బల కుమార్ కుమారుడు ప్రేమ్ చరణ్ ఇటీవల కాలంలో ఆరోగ్యం బాగోలేని కారణంగా పిఠాపురం కార్తికేయ హాస్పిటల్ లోలి చికిత్స పొందుతున్నారని తెలిసి ప్రేమ్ చరణ్ ను పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించి డాక్టర్ కాశిని కలిసి మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని సూచించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,జువ్వల ముసలయ్య ,పాస్టర్ రాపా అనిల్ కుమార్ ,సిపిఎం చర్చ్ పాస్టర్ ఎన్నోజ్ కిషోర్ ,జువ్వల రాజు ,ఎంటిపల్లి త్రిమూర్తులు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

సంతేబిదనూర్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ విస్తృత ఎన్నికల ప్రచారం

హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్:అక్టోబర్30: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి: హిందూపురం మండలం సంతేబిదనూర్ గ్రామం లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా హిందూపురం రూరల్ మండల జెడ్పీటీసీ అభ్యర్థి పి సావిత్రమ్మ ని సంతేబిదనూర్ గ్రామం స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి మహబూబ్ జాన్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిలానీ ఖక్రుద్దీన్ బాబాజన్ షహాజన్ శ్రీరాములు ఆనందప్ప రాజసుమన్ లోకేష్ రెడ్డి చంద్ర శివ తిమ్మారెడ్డి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసిలో కేత్ బచావో అభియాన్ (పొలం సంరక్షణ కార్యక్రమం) నిర్వహణ

ఎమ్మిగనూరు, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసిలో కేత్ బచావో అభియాన్ (పొలం సంరక్షణ కార్యక్రమం) నిర్వహించడం జరిగిందని కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ వి. జయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ పి.ఎల్. వరలక్ష్మి, ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కాద్రి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహులు, డాక్టర్ చైతన్య, డాక్టర్ కవిత తదితరులు హాజరై రైతులకు వ్యవసాయంలో నేల సంరక్షణ, భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ వి. జయలక్ష్మి మాట్లాడుతూ, రైతులు ప్రతి రెండు నుంచి మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని సూచించారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా నేలలో భౌతిక, రసాయన లక్షణాలను మెరుగుపరిచేందుకు సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచాలన్నారు. జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని, రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లం వంటి జీవన ఎరువులను పంటల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా (ఎఫ్ పి ఓ ఎస్) ఏర్పడి వాటిని బలోపేతం చేసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ పి.ఎల్. వరలక్ష్మి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే సుమారు 42 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించుకోవచ్చని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా కొర్రలు, జొన్నలు, పప్పుశనగ, కుసుమ వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా రైతులందరూ రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో నేలలో సేంద్రియ కర్బనం శాతం 0.3 నుంచి 0.5 శాతం వరకు మాత్రమే ఉందని తెలిపారు. నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించేందుకు జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, బయోచార్ వంటి సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పంటల ఉత్పాదకతను దీర్ఘకాలికంగా పెంచుకోవచ్చని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ, కొర్రలో అధిక దిగుబడినిచ్చే సూర్యనంది, మహానంది, ఎస్ఐఏ 3156 రకాలను సాగు చేయడం ద్వారా తక్కువ కాలంలో మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా సజ్జలో ఏబీబీ-04 రకం సాగుకు అనుకూలమని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య మాట్లాడుతూ, మిరప పంటలో వచ్చే మొదలుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు రెండు కిలోల ట్రైకోడెర్మా, రెండు కిలోల సూడోమోనాస్‌ను తగిన సేంద్రియ పదార్థంతో కలిపి భూమిలో వేయాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ కవిత మాట్లాడుతూ, రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగిస్తూ, క్రమం తప్పకుండా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని తెలిపారు. పంట మార్పిడి ద్వారా నేలలో తెగుళ్లకు కారణమయ్యే శిలీంధ్రాలు, పురుగుల ఉధృతిని తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీవాణి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీచందన, మౌనిక, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని శాస్త్రవేత్తల నుంచి పలు వ్యవసాయ సలహాలు, సూచనలు పొందారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే శిరీషాదేవి ముమ్మర ప్రచారం!

కూనవరంలో ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి

కాచవరం ఎస్సీ కాలనీలోనూ కూటమి అభ్యర్థి తరపున విస్తృత ప్రచారం

కూనవరం అక్టోబర్ 30. (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు)కూనవరం: స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం కూనవరం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని హైస్కూల్ సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కూనవరం ఎంపీటీసీ-1 కూటమి అభ్యర్థి కొయ్యల కనక లక్ష్మీ ప్రసన్నకు సైకిల్ గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి పాయం వెంకయ్యకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కూనవరం మండలం కాచవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పోచవరం ఎంపీటీసీ కూటమి అభ్యర్థిని కౌలూరి రమణ తరఫున కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తదితర నాయకులు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా ఎమ్మెల్యే శిరీషాదేవి స్వయంగా ప్రచార బరిలోకి దిగడంతో కూనవరంలో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.

చిన్న ఎరసాల ఎంపీటీసీ స్థానానికి జోరుగా ఎన్నికల ప్రచారం!

పోరుమామిళ్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్న ఎరసాల ఎంపీటీసీ స్థానానికి నిర్వహిస్తున్న ఉప ఎన్నికల పోరు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన శ్రీ పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. స్వగ్రామంపై మమకారంతోనే పోటీ పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ తాతముత్తాతల కాలం నాటి తమ పూర్వికుల స్వగ్రామమైన చిన్న ఎరసాల అంటే తనకు ఎనలేని ప్రేమానురాగాలు ఉన్నాయని తెలిపారు. "ప్రస్తుతం మేము 'రామ్ రెడ్డి కుంట'కు వలస వెళ్లినప్పటికీ, నా మూలాలు ఉన్న నా స్వగ్రామ అభివృద్ధి కోసమే నేను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. నా ఊరి రుణం తీర్చుకోవడానికి, మౌలిక వసతులు కల్పించి ప్రగతి బాటలో నడిపించడమే నా ప్రధాన లక్ష్యం" అని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధికి బాట వేద్దాం 'విండో ఏసీ' గుర్తుకు ఓటెయ్యండి స్థానిక ప్రజల మద్దతుతో బరిలో నిలిచిన హర్షవర్ధన్ రెడ్డికి 'విండో ఏసీ' గుర్తు కేటాయించబడింది. ప్రచారంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తున్న ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

"మీరే నా బలం.. మీరే నా ధైర్యం!"

"స్థానిక ఓటర్లందరూ తమ అమూల్యమైన ఓటును 'విండో ఏసీ' గుర్తుపై వేసి, నన్ను భారీ మెజార్టీతో గెలిపించి ఊరి అభివృద్ధికి సహకరించాలని సవినయంగాఅభ్యర్థిస్తున్నాను." పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి అభ్యర్థి శ్రీ పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి (స్వతంత్ర అభ్యర్థి) స్థానం: చిన్న ఎరసాల వీఊజ, పోరుమామిళ్ల

మండలం, వైఎస్సార్ కడప జిల్లా ఎన్నికల గుర్తు: విండో ఏసీ పోలింగ్ తేదీ: 05-11-2026

ఇంటర్ పరీక్ష ఫీజుల పేరుతో విద్యార్థుల దోపిడీని అరికట్టాలి

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే మూడింతలు వసూలు చేయడం దారుణం

ఇూరాఖీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దేశముద్రపు. కిరణ్ కుమార్.

కడప ,అన్నమయ్య జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజుల పేరుతో కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి మూడింతలు అధికంగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురిచేయడం దారుణమని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దేశముద్రపు. కిరణ్ కుమార్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష ఫీజులకంటే అధికంగా వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి, పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం ఎంత మాత్రం సహించరాని విషయమని పేర్కొన్నారు. ఇంటర్ అధికారులు తక్షణమే స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలను ప్రతి కార్పొరేట్ ప్రవేట్ కళాశాలలో స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇూరాఖీ జిల్లా నగర నాయకులు విష్ణు, పవన్, సోము తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద రూ.1.35 కోట్ల గంజాయి పట్టివేత

--270.175 కిలోల గంజాయి స్వాధీనం..

--ఇద్దరి అరెస్ట్.. మరో ప్రధాన నిందితుడు పరారీ

--వివరాలు వెల్లడించిన సీఐ బి ఎస్ అప్పారావు

--ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం, ఈగల్ టీంను అభినందించిన సీఐ బిఎస్ అప్పారావు

కాకినాడ జిల్లా అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ఒడిశా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రూ.1.35 కోట్ల విలువైన 270.175 కిలోల గంజాయిని ఈగల్ టీంకు వచ్చిన సమాచారంతో ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బి ఎస్ అప్పారావు మాట్లాడుతూ ధర్మవరం గ్రామ శివారులోని జాతీయ రహదారి-16పై శుక్రవారం ఉదయం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఎనిమిది బస్తాల్లో ఉన్న గంజాయితో పాటు రెండు ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బి ఎస్ అప్పారావు తెలిపారు. నిందితులు అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బెన్నభూపాలపట్నం గ్రామానికి చెందిన ఆదిరాజు నాయుడు (24), అప్పలనాయుడు కుమారుడు, పోతురాజు మణికంఠ అలియాస్ స్వామి (24), దివంగత చంద్రరావు కుమారుడిగా గుర్తించనట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఎనిమిది బస్తాల్లో ఉన్న 270.175 కిలోల గంజాయితో పాటు రెండు ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, అరెస్టయిన ఇద్దరినీ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిసినవారు 1972 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. గంజాయి నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం, పోలీసు సిబ్బంది, ఈగల్ టీం సభ్యులను, వీఆర్వోలు ఈశ్వరి, పద్మినిలను అభినందించారు.

గ్రామాల అభివృద్ధినే కూటమి లక్ష్యం

నీలాపురం ఎంపీటీసీ బిజెపి అభ్యర్థిని బలపరచండి

రాష్ట్ర నాయకులు ఆరవేటి హరికృష్ణ

దువ్వూరు,అక్టోబరు30 (ప్రజా జ్యోతి) గ్రామాల అభివృద్ధి కూటమి సర్కారుతోనే సాధ్యమని నీలాపురం ఎంపీటీసీ అభ్యర్థి అమ్మిరెడ్డి మనోహర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆరవేటి హరికృష్ణలు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నీలాపురం ఎంపీటీసీ అభ్యర్థి భారతీయ జనతా పార్టీ జనసేన తెలుగుదేశం పార్టీ బలపరిచి పోటీ చేస్తున్న వ్యక్తి మనోహర్ రెడ్డికి మద్దతుగా శుక్రవారం నీలాపురం గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయని ఆ నిధులతో గ్రామాలు అభివృద్ధి వైపు సాగుతున్నాయన్నారు. ఎంపిటిసి అభ్యర్థిగా వారి మెజార్టీతో గెలిపిస్తే గ్రామాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. వారి వెంట భారతీయ జనతపార్టీ మాజీ మండల అధ్యక్షులు అమ్మిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి, బ్రహ్మంగారి మఠం బీజేపీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబులరెడ్డి, దువ్వూరు బీజేపీ అధ్యక్షులు పల్లె సుబ్బారెడ్డి,కాజీపేట మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, చాపాడు మండల అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి, మాజీ మండలఅధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంతం ఈశ్వరయ్య, బీజేపీ నాయకులు గుర్రప్ప, మనోహర్, మురళి, బాలనాగిరెడ్డి, చంద్ర, రామ మునిరెడ్డి, రంగనాథ్, వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురపెంటవీడులో వైసీపీ, సీపీఎం ఇంటింటి ప్రచారం హోరు!

జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, ఎంపీటీసీ అభ్యర్థి అపకా సమ్మక్కకు మద్దతుగా ప్రచారం

ప్రజాసేవకు అవకాశం కల్పించండి అభ్యర్థుల విజయం కోసం నాయకుల విజ్ఞప్తి

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. త్రిపురపెంటవీడు ఎంపీటీసీ పరిధిలో వైఎస్సార్‌సీపీ, సీపీఎం శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, ఎంపీటీసీ అభ్యర్థి అపకా సమ్మక్క విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్రిపురపెంటవీడు పరిధిలోని అవేర్ కాలనీ, కుసుమనపల్లి, ఒడ్డుగుంపు, తోటపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో అభ్యర్థులతో పాటు వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజాసేవే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచిన తమకు అవకాశం కల్పించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు గుప్పించారు. గతంలో ఇంటింటికీ రేషన్ అందించే విధానాన్ని మార్చి, ప్రజలు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. ఎరువుల కొనుగోలుకు సైతం యాప్‌పై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం కోసం జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, త్రిపురపెంటవీడు ఎంపీటీసీ అభ్యర్థి అపకా సమ్మక్కకు మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం ద్వారా ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రం నిరంతర అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి...

జిల్లా ఉపాధ్యక్షులు కౌతాళం మండలం జడ్పీటీసీ అభ్యర్థి చూడి ఉలిగయ్య

:-ప్రతి హామీని నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం...యువ నాయకులు సతీష్ నాయుడు మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు

కౌతాళం, అక్టోబర్ 30 ప్రజా జ్యోతి శుక్రవారం రోజున మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం బంటకుంట- సులేకేరి,లింగాలదిన్నె -కాత్రికి మరియు గోతులదొడ్డి గ్రామాల నందు కూటమి ప్రభుత్వం బలపర్చిన సులేకేరి గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా సోనీ,ఆగసలదిన్నె లింగాలదిన్నే ఎంపీటీసీ అభ్యర్థిగా తలారి యల్లమ్మని కాత్రికి ఎంపీటీసీ అభ్యర్థిగా బసవరాజుని కుంబలనూరు ఎంపీటీసీ అభ్యర్థిగా సురేఖని మరియు కౌతాళం మండలం జడ్పీటీసీ అభ్యర్థి నన్ను మీ ఉలిగయ్యని మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుతో ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ఎన్నికల ప్రచారంలో ఓటరు మహాశయులను సతీష్ నాయుడు మరియు సురేష్ నాయుడు గారు కోరారు.కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని,ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించామని చేసేది చెప్పమని, చెప్పిందే చేశామని తెలియజేస్తూ అందుకే కూటమి ప్రభుత్వం మీద నమ్మకం ప్రజలకు కలిగిందని, రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం మీద భరోసాతో ఉన్నారాని తెలియజేశారు.ఈ కార్యక్రమములో కాత్రికి చంద్రన్న,మారెప్ప, బసవ, సులేకేరి ఈరన్న, గోవిందప్ప,ఎల్లప్ప, వీరేష్,హనుమంతు,నాగేంద్ర రెడ్డి,చంద్ర, ఉమాపతి, నాగేష్, చెన్నబసవ, మహేష్, వెంకటేష్,శ్రీకాంత్ మొదలగు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది

ప్రచార గడువు ముగిసిన వెంటనే స్థానికేతర రాజకీయ నాయకులు, ప్రచారకులు పట్టణాలను విడిచి వెళ్లాలి

హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లలో విస్తృత తనిఖీలు చేపట్టాలి

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి

నంద్యాల జిల్లా: బ్యూరో వి.మద్దిలేటి స్వామి అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి) నంద్యాల జిల్లాలో నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల ప్రచార గడువు నేడు (అక్టోబర్ 30) సాయంత్రం 5 గంటలకు ముగిసిన నేపథ్యంలో స్థానికేతర రాజకీయ నాయకులు, ప్రచారకులు పట్టణాలను విడిచి వెళ్లాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం, 1965లోని సెక్షన్ 343-సి ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల వ్యవధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రచార గడువు ముగిసిన వెంటనే సంబంధిత మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఓటర్లు కాని బయటి రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రచారకులు, మద్దతుదారులు తప్పనిసరిగా ఆ ప్రాంతాలను విడిచి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. బయటి ప్రచారకుల ఉనికిని గుర్తించేందుకు హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, కళ్యాణ మండపాలు, ఇతర వసతి కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని, కీలక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రచార గడువు ముగిసిన వెంటనే స్థానికేతర ప్రచారకులు, మద్దతుదారులు సంబంధిత పట్టణ స్థానిక సంస్థల పరిధిని విడిచి వెళ్లేలా చూడాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే ఎన్నికల చట్టాలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

టీడీపీ--బీజేపీ--జనసేన కూటమిని ఓడించండి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

అడవుల నుంచి ఆదివాసులను వెళ్లగొట్టే కుట్రలను విరమించుకోవాలి

వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు, కనీస వసతులు కల్పించాలి

సాగులో ఉన్న పోడు భూములకు వెంటనే పట్టాలివ్వాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి పిలుపు

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న టీడీపీ--బీజేపీ--జనసేన కూటమి ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ప్రజలు ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఎటపాక మండల పరిధిలోని చింతలపాడు గ్రామంలో ఐదు గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి మడకం భీమరాజు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకులు సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఇచ్చిన హామీల అమలు, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయ రంగాల దుస్థితిపై ప్రజలు గళమెత్తాలని సూచించారు. హక్కుల సాధన, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని వలస ఆదివాసీ కుటుంబాల విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందక ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ఫారెస్ట్ అధికారులు దాడులకు పాల్పడుతూ ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అబద్ధపు హామీలు గుప్పించి, గెలిచిన తర్వాత వలస ఆదివాసీ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలే తిరగబడి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన, పీడీఎస్యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగేల శివప్రశాంత్, పీవోడబ్ల్యూ నాయకురాలు మునిగేల మహేశ్వరి, మండల నాయకులు మడకం దేవా, మడవి మొదయ్య, మడకం వీరయ్య, కారం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో సీపీఐ ప్రచార హోరు.. కంకి కొడవలి గుర్తుకు ఓటేయాలని ఇంటింటా విజ్ఞప్తి!

చిన్నార్కూర్, టేకులబోరులో జోరుగా ఎన్నికల ప్రచారం

-- భారీగా పాల్గొన్న సీపీఐ మహిళా శ్రేణులు

కూనవరం అక్టోబర్ 30. (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) కూనవరం: మండలంలో సీపీఐ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జెడ్పీటీసీ అభ్యర్థి గుజ్జా మోహన్‌రావు విజయమే లక్ష్యంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం చిన్నార్కూర్, టేకులబోరు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ కంకి కొడవలి గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గుజ్జా మోహన్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యంగా టేకులబోరు గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో అధిక సంఖ్యలో సీపీఐ మహిళా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ప్రచారాన్ని హోరెత్తించారు. గ్రామాల్లో ప్రజల మద్దతు కూడగట్టేందుకు నాయకులు విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి సీపీఐ అభ్యర్థి గుజ్జా మోహన్‌రావును గెలిపించాలని నినదిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు.

నాయుడు హవా గొల్లప్రోలులో మున్సిపల్ పోరు పీక్స్

బైక్ ర్యాలీతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్!

గొల్లప్రోలు ప్రజా జ్యోతి మున్సిపల్ సమరం క్లైమాక్స్‌కు చేరుకోవడంతో గొల్లప్రోలు లో రాజకీయ సెగలు రేగుతున్నాయి. ప్రచారానికి సమయం ముగుస్తున్న కొద్దీ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహ-ప్రతివ్యూహాలతో సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూటమి పార్టీల ఉమ్మడి అభ్యర్థి, ప్రముఖ విద్యావేత్త, జన హృదయ నేత కడారి తమ్మయ్య నాయుడు ఆధ్వర్యంలో సాగిన ప్రచార పర్వం గొల్లప్రోలు మున్సిపాలిటీ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. “మన లీడర్ తమ్మయ్య నాయుడు” అంటూ అశేష జనం జేజేలు పలుకుతుంటే, ప్రత్యర్థి పార్టీల శిబిరాల్లో అలజడి మొదలైంది.కడారి తమ్మయ్య నాయుడు తన సొంత విద్యాసంస్థ అయిన ప్రఖ్యాత ‘మాధురి విద్యాలయం’ ప్రాంగణం నుండి ఈ ఎన్నికల సమర శంఖాన్ని పూరించారు. కూటమిలోని మూడు పార్టీల అగ్రనేతలు ఉత్సాహభరిత కార్యకర్తలు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. టిడిపి, బిజెపి, జనసేన జెండాలు రెపరెపలాడుతుంటే గొల్లప్రోలు వీధులు మూడు రంగుల సాగరాన్ని తలపించాయి. “అభివృద్ధే మన ముఖచిత్రం.. గొల్లప్రోలు సమూల మార్పే మన లక్ష్యం” అనే నినాదాలతో నాయుడు అడుగులు వేస్తుంటే, ప్రతి ఇంట్లోనూ మహిళలు హారతులు పట్టి, తిలకం దిద్ది బ్రహ్మరథం పట్టారు. ఈ ప్రజాదరణ చూస్తుంటే ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ ప్రచార పర్వంలో అసలు సిసలైన హైలైట్.. కళ్లు చెదిరే భారీ బైక్ ర్యాలీ. వందలాది మోటార్ సైకిళ్లపై కూటమి శ్రేణులు గొల్లప్రోలు పురవీధుల్లో దూసుకెళ్తుంటే, ఇంజన్ల మోతకు.. కార్యకర్తల జై నినాదాలకు పట్టణం మార్మోగిపోయింది. ఈ అపూర్వ ప్రజా స్పందనను చూసిన స్థానికులు.. “ఇది ఓట్ల కోసం చేస్తున్న ప్రచారంలా లేదు.. విజయం ఖాయమై సింహంలా నగరంలోకి తిరిగొచ్చిన లీడర్ విజయ యాత్రలా ఉంది!” అని గుసగుసలాడుకోవడం విశేషం. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా, తెరవెనుక ఎన్ని వ్యూహాలు రచించినా.. ప్రస్తుతం గొల్లప్రోలు గల్లీ గల్లీలోనూ కడారి తమ్మయ్య నాయుడు హవా క్లియర్ కట్‌గా కనిపిస్తోంది. ఆయన వేసే ప్రతి అడుగులోనూ, మాట్లాడే ప్రతి మాటలోనూ గెలుపు ధీమా స్పష్టంగా ఉట్టిపడుతోంది.

వార్డు వార్డునా చాణక్య వ్యూహం: క్లీన్ స్వీప్‌పై కన్ను!

కేవలం తమ్మయ్య నాయుడు గెలుపు మాత్రమే కాదు, గొల్లప్రోలు మున్సిపాలిటీపై కూటమి జెండాను సంపూర్ణంగా ఎగరేయడమే లక్ష్యంగా అభ్యర్థులు రంగంలోకి దిగారు. ప్రతి వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి శ్రేణులు పిలుపునిచ్చాయి. గడప గడపకూ తిరుగుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. “నాయుడు నడిస్తే అదో ట్రెండ్.. ఆయన వెనుకున్న జనాన్ని చూస్తే ప్రత్యర్థుల పొలిటికల్ కెరీర్‌కు ఎండ్!” అనే రేంజ్‌లో కూటమి సైన్యం దూసుకుపోతోంది. ముగింపు దశకు చేరిన ఈ ప్రచార జోష్ చూస్తుంటే గొల్లప్రోలు మున్సిపాలిటీలో కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

తెలుగు తమ్ముళ్లూ.. ఒక్కసారి ఆలోచించండి!

నేడు జెడ్పీటీసీ.. రేపు అసెంబ్లీ సీటు బీజేపీ చేతిలోకి వెళ్లే ప్రమాదం!

బీజేపీ రాజకీయ వ్యూహాలపై సీపీఐ నేత గుజ్జా మోహన్ రావు సంచలన వ్యాఖ్యలు

కూనవరం అక్టోబర్ 30, (ప్రజా జ్యోతి ప్రతి నిధి కిరణ్ బాబు) కూనవరం: రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని.. కానీ రాజకీయ పొత్తుల ముసుగులో పార్టీ ఉనికికే ప్రమాదం వాటిల్లితే కోలుకోవడం అంత సులభం కాదని సీపీఐ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జా మోహన్ రావు హెచ్చరించారు. కూనవరం మండలంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం కోండ్రాజుపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాల కారణంగా అనేక ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ఇదే తరహా రాజకీయాలు కూనవరం మండలంలోనూ చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో ఎంతో కష్టపడి పనిచేసి ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడం వెనుక బీజేపీ రాజకీయ వ్యూహాలు ఉన్నాయని ఆరోపించారు. అప్పట్లో ఎన్నికల గుర్తు సైకిల్ అయినప్పటికీ అభ్యర్థి మాత్రం బీజేపీకి చెందిన వ్యక్తేనని టీడీపీ కార్యకర్తలే బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అదే రాజకీయ వ్యూహం అమలవుతోందా? అని ప్రశ్నించారు. టీడీపీలో ఎంతోకాలంగా పనిచేస్తున్న పొడియం అప్పారావును పక్కనపెట్టి, పాయం వెంకయ్యకు బీఫామ్ ఇవ్వడం వెనుక బీజేపీ మార్కు రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా ప్రాణసంకటంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు బీజేపీ బలపరిచిన అభ్యర్థికి ఓట్లు వేస్తే.. ఆ ఓట్ల బలాన్ని తమ రాజకీయ బలంగా చూపించి భవిష్యత్తులో రంపచోడవరం అసెంబ్లీ స్థానాన్ని సైతం పొత్తులో భాగంగా బీజేపీ తమ ఖాతాలో వేసుకునే అవకాశం లేకపోలేదని వ్యాఖ్యానించారు. “చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదు. ఈరోజు మీ ఓట్లతో బీజేపీకి రాజకీయ బలం చేకూర్చి, రేపు మీ పార్టీ ఉనికికే ముప్పు తెచ్చుకోవద్దు. తెలుగు తమ్ముళ్లారా.. ఇప్పటికైనా మేల్కొండి. మీ వేలితో మీ కంటినే పొడిచే రాజకీయ వ్యూహాల పట్ల అప్రమత్తంగా ఉండండి” అంటూ గుజ్జా మోహన్ రావు టీడీపీ శ్రేణులకు హితవు పలికారు. ఈ సమావేశంలో కూనవరం మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు, జుత్తుక ఈశ్వర ప్రసాద్, సోడే కన్నారావు, బుడుపుటి వెంకటేశ్వర్లు, పొడియం సీతారామయ్య, సోడే దివాకర్ తదితరులు పాల్గొన్నారు

పోరుమామిళ్ల 'మహారాజ్ రెస్టారెంట్'పై ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడి!

కల్తీ తేలితే లైసెన్స్ రద్దు చేస్తాం జిల్లా ఎఫ్ఎస్ఓ హరిత కఠిన హెచ్చరిక

పోరుమామిళ్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి) పోరుమామిళ్ల పట్టణాల్లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘించిన హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తమ నిఘా నేత్రాన్ని పదునుపెట్టారు. కడప జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఫ్సీూ) హరిత గారి ఆదేశాల మేరకు శుక్రవారం పోరుమామిళ్ల మండల కేంద్రంలోని అత్యంత బిజీగా ఉండే 'మహారాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్'లో అధికారులు ఒక్కసారిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో స్థానిక వ్యాపారుల్లో తీవ్ర కలకలం రేగింది.

ఫిర్యాదుల వెల్లువ.. రంగంలోకి ఫుడ్ సేఫ్టీ టీమ్!

ఇటీవలి కాలంలో మహారాజ్ రెస్టారెంట్‌లో వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత దారుణంగా పడిపోయిందని, రుచితో పాటు శుభ్రత కూడా కరువైందంటూ పలువురు వినియోగదారుల నుంచి జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనికి తోడు నమ్మకమైన వర్గాల నుండి వచ్చిన రహస్య సమాచారాన్ని తీవ్రంగా పరిగణించిన ఎఫ్ఎస్ఓ హరిత నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో ఈ మెరుపు దాడులు నిర్వహించింది.

కిచెన్‌లో అపరిశుభ్రత.. సంచలన నిజాలు వెలుగులోకి!

సోదాల్లో భాగంగా అధికారులు రెస్టారెంట్‌కు సంబంధించిన ప్రధాన వంటగది (కిచెన్), ఆహార పదార్థాల నిల్వ కేంద్రం (స్టోర్ రూమ్)లతో పాటు ఫ్రిజ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో కిచెన్‌లో పరిసరాలు తీవ్ర అపరిశుభ్రంగా ఉండటం, వంటకు ఉపయోగిస్తున్న నూనెలు, మసాలా దినుసులు, మాంసం నిల్వల నాణ్యతపై తీవ్ర సందేహాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఈ రెస్టారెంట్‌లో వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే 'చికెన్ లాలిపాప్' తయారీలో వాడుతున్న రసాయన రంగులు, మసాలాలపై అధికారులకు స్పష్టమైన అనుమానాలు వచ్చాయి. తక్షణమే స్పందించిన అధికారులు ఆ శాంపిల్స్‌ను ప్రత్యేక సీల్డ్ కిట్లలో సేకరించారు. పూర్తిస్థాయి రసాయన విశ్లేషణ మరియు కల్తీ నిర్ధారణ కోసం ఈ నమూనాలను హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ సేఫ్టీ లాబొరేటరీకి పంపినట్లు వెల్లడించారు.

హోటల్ లైసెన్స్ రద్దు చేస్తాం -- ఎఫ్ఎస్ఓ హరిత హెచ్చరిక

ఈ తనిఖీల అనంతరం కడప జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి హరిత విలేకరులతో మాట్లాడుతూ.."ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. లాభాపేక్షతో ఆహారంలో హానికరమైన రసాయనాలు, కృత్రిమ రంగులు వాడితే ఉపేక్షించేది లేదు. హైదరాబాద్ ల్యాబ్ నుండి నివేదిక రాగానే, ఒకవేళ చికెన్ లాలిపాప్‌లో కల్తీ లేదా అనారోగ్యకరమైన పదార్థాలు ఉన్నట్లు తేలితే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ ప్రకారం సదరు యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, హోటల్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేస్తాం." అని స్పష్టం చేశారు.

యాజమాన్యానికి కఠిన ఆదేశాలు నోటీసులు జారీ

తనిఖీల సందర్భంగా గుర్తించిన పలు సాంకేతిక, పరిశుభ్రత లోపాలపై హోటల్ యాజమాన్యాన్ని అధికారులు తీవ్రంగా నిలదీశారు. వంట చేసే మాస్టర్లు తప్పనిసరిగా హెయిర్ క్యాప్స్, మాస్కులు, గ్లౌజెస్ ధరించాలని, రోజువారీ మిగిలిపోయిన పాత మాంసాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి మరుసటి రోజు వడ్డించకూడదని గట్టిగా ఆదేశించారు. గుర్తించిన లోపాలపై

తక్షణమే రాతపూర్వక వివరణ ఇవ్వాలని కోరుతూ హోటల్ యజమానికి నోటీసులు అందజేశారు. పోరుమామిళ్ల లాంటి మండల కేంద్రాల్లోని ప్రముఖ రెస్టారెంట్లలో కూడా ఇలాంటి ఆకస్మిక సోదాలు నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు, ఆహార ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ, మండల స్థాయిల్లో ఉన్న హోటళ్లపై కూడా అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొందూరు రైల్వే స్టేషన్‌లో 31 కిలోల గంజాయి పట్టివేత!

- కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

- రెండు భారీ సూట్‌కేసుల్లో గంజాయి తరలింపు

- ఆటో డ్రైవర్ల అప్రమత్తతతో వెలుగులోకి అక్రమ రవాణా

పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్: పొందూరు రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. అక్రమంగా తరలిస్తున్న 31 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సి. ఐ సన్యాసినాయుడు ,ఎస్.ఐ రాజేష్ తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, రెండు భారీ సూట్‌కేసులను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ల అప్రమత్తతతో ఈ అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి రావడం విశేషం. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రంలోని ధారవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశాలోని రాయగడ నుంచి గంజాయిని సేకరించి రైలు మార్గంలో తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. విజయనగరం నుంచి భువనేశ్వర్ వెళ్లే రైలులో ప్రయాణిస్తున్న వీరు, పొందూరు రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ కారణంగా రైలు ఆగడంతో రెండు భారీ సూట్‌కేసులతో కిందకు దిగారు. అనంతరం బస్టాండ్ కు వెళ్లేందుకు ఆటో డ్రైవర్లను సంప్రదించారు. అయితే రెండు భారీ సూట్‌కేసులతో అనుమానాస్పదంగా కనిపించడంతో ఆటో డ్రైవర్లు వారిపై అనుమానం వ్యక్తం చేసి వెంటనే పొందూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పొందూరు ఎస్సై రాజేష్ పోలీసు సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకొని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు సూట్‌కేసులను పొందూరు తహసీల్దార్ సమక్షంలో పరిశీలించగా రూ.1,95,000 విలువగల 31 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. దీంతో గంజాయితో పాటు

మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ధారవాడకు చెందిన సుధీర్‌పై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు ఎస్సై రాజేష్ వెల్లడించారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

పోలీస్ విధుల్లో నిబద్ధతే ప్రథమ కర్తవ్యం

కొత్త కానిస్టేబుళ్లకు ఎస్పీ ఉమామహేశ్వర్ దిశానిర్దేశం

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) కఠిన శిక్షణను పూర్తి చేసుకుని పోలీస్ శాఖలో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కానిస్టేబుళ్లు క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ సూచించారు. పోలీస్ వృత్తిలో నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి బాపట్ల జిల్లాకు కేటాయించబడిన 74 మంది నూతన కానిస్టేబుళ్లతో శుక్రవారం బాపట్లలోని సాయి ప్యాలెస్ ఫంక్షన్ హాలులో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలను తెలుసుకుని పోలీస్ శాఖలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం కేవలం విధుల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యతతో కూడుకున్నదన్నారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన యువత పోలీస్ శాఖలో చేరడం అభినందనీయమని, వారి విద్యా పరిజ్ఞానాన్ని విధుల్లో సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పై అధికారుల ఆదేశాలను పాటిస్తూ నిష్పక్షపాతంగా, అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు కొత్త రూపాల్లో ప్రజలను మోసగిస్తున్న నేపథ్యంలో వాటిపై ప్రతి పోలీస్ సిబ్బందికి పూర్తి అవగాహన అవసరమన్నారు. సైబర్ నేరగాళ్ల విధానాలను గుర్తించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని ఎదుర్కోవడం నేర్చుకోవాలని సూచించారు. పోలీస్ అంటే నిత్య విద్యార్థి అని, విధుల్లో చేరిన తర్వాత కూడా నిరంతర అధ్యయనం, శిక్షణ ద్వారా వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంచుకోవాలని స్పష్టం చేశారు. స్మార్ట్ పోలీసింగ్ అప్లికేషన్ల వినియోగంపై కూడా పట్టు సాధించాలన్నారు. నవంబర్ 1న చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల విధులకు ఈ 74 మంది కానిస్టేబుళ్ల సేవలను వినియోగించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల సమయంలో అప్రమత్తతతో వ్యవహరించాలని, నిష్పక్షపాతంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ అప్పగించిన విధులను సమయస్ఫూర్తితో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, ఏఆర్ డీఎస్పీ పి. కృష్ణంరాజు, ఎస్బీ సీఐ నారాయణ, బాపట్ల టౌన్ సీఐ రాంబాబు, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

--పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు మారుటేరు శాస్త్రవేత్తల సూచనలు

--చిన్న ఏలూరు, టి.రాయవరం, ప్రత్తిపాడులో వరి పొలాల పరిశీలన

కాకినాడ జిల్లా అక్టోబర్ 30(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని మారుటేరు ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ డి.శేఖర్ సూచించారు. గురువారం జగ్గంపేట డివిజన్ ఏడీఏ జి.శ్రీనివాసరావు, ఎంఆర్ఓ సూర్యప్రభ, ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారి జోకా అమృతతో కలిసి చిన్న ఏలూరు, టి.రాయవరం, ప్రత్తిపాడు గ్రామాల్లో తుఫాను ప్రభావిత వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోత దశలో ఉన్న పంటలో కంకులకు మొలకలు వస్తే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, కల్లాల్లో, కుప్పలపై ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పి రక్షించుకోవాలని తెలిపారు. నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేకపోతే క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపాలని సూచించారు. ఎండాకు తెగులు, మాగుడు, మానిపండు, ఆకుముడత, దోమపోటు నివారణకు పంట పరిస్థితిని బట్టి సంబంధిత రక్షణ మందులను సిఫార్సు చేసిన మోతాదుల్లో పిచికారీ చేయాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్ఎస్‌కే సిబ్బంది ఏఈఓ అర్జున్, వీఏఏ మణికంఠ, వరహాలు రాఘవ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ

వార్డుల్లో పంపిణీ తీరును పరిశీలించిన కమిషనర్ హాసిని

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చేరాలనే లక్ష్యంతో బాపట్ల పురపాలక సంఘ పరిధిలో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను కమిషనర్ ఎం. హాసిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే చేపట్టిన పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు వార్డుల్లో సిబ్బంది పనితీరును సమీక్షించారు. శ్రీనివాసనగర్ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లిన కమిషనర్ పెన్షన్లను అందజేశారు. అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగదు అందేలా చూడాలని, పంపిణీలో జాప్యం జరగకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదే రోజు నూరుశాతం పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

లక్ష్మీపురంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం!

-- ఇంటింటికీ కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం నేతలు, కార్యకర్తలు
-- వామపక్ష పార్టీల సంపూర్ణ మద్దతుతో బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రంబాల నాగేశ్వరరావు
-- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి రంబాల నాగేశ్వరరావు విజ్ఞప్తి

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సీపీఐ, సీపీఎం వామపక్ష పార్టీల సంపూర్ణ మద్దతుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రంబాల నాగేశ్వరరావు శుక్రవారం లక్ష్మీపురం, పట్టుచీర, కన్నాపురం గ్రామంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీతో లక్ష్మీపురం గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది. ప్రచారంలో భాగంగా అభ్యర్థి రంబాల నాగేశ్వరరావు ప్రతి ఇంటికీ వెళ్లి వృద్ధులు, మహిళలు, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటూ ఓటర్లతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి రంబాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తాను ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో లక్ష్మీపురం పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వామి అవుతానని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాకా అర్జున్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆకుల వెంకట

రామారావు, నవనాసి శ్రీనివాసరావు, కోడూరి నవీన్, ఆకుల దయాకర్, వరద బ్రహ్మం, ఎలిశాల నాగరాజు తదితరులతో పాటు సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి ఉబ్బా సుస్మిత గెలుపే లక్ష్యం!

-- 'ఏసీ' గుర్తుపై ఓటు వేసి సుస్మితకు మద్దతివ్వండి
-- బీజేపీ నేతలు కుంజా ధర్మా, సంతోష్ పిలుపు!
-- గంగారంలో కూటమి ముఖ్య నాయకుల సమావేశం
-- హాజరైన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, ఎన్నికల పరిశీలకుడు సత్తిబాబు
-- నవంబర్ 5 పోలింగ్‌కు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలి

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎటపాక మండల జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి కూటమి అభ్యర్థి ఉబ్బా సుస్మిత విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని భద్రాచలం బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్ పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి సుస్మితను ప్రజలు ఆదరించి, ఎయిర్ కండిషనర్ (ఏసీ) గుర్తుపై ఓటు వేసి మద్దతు తెలియజేయాలని కోరారు. ఎటపాక మండలం గంగారం గ్రామంలోని ఉబ్బా సుస్మిత నివాసంలో శుక్రవారం నిర్వహించిన కూటమి ముఖ్య నాయకుల సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, కూటమి ఎన్నికల పరిశీలకుడు సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి ఉబ్బా సుస్మితకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, ఎన్నికల్లో తమ మద్దతును ప్రకటించారు.

ఓటర్లను కలవాలి.. మద్దతు కూడగట్టాలి

ఈ సందర్భంగా భద్రాచలం బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్ మాట్లాడుతూ.. ఎటపాక మండలానికి చెందిన ఓటర్లలో కొందరు భద్రాచలం పట్టణంలో నివసిస్తున్నందున వారిని ప్రత్యక్షంగా కలిసి కూటమి అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీల మధ్య ఉన్న సమన్వయాన్ని క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తూ ప్రతి ఓటరును కలిసి అభ్యర్థి గురించి వివరించాలని కోరారు. నవంబర్ 5న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రచార గడువు ముగిసే నవంబర్ 3 వరకు పార్టీ శ్రేణులంతా అహర్నిశలు శ్రమించాలని సూచించారు. గ్రామగ్రామాన పర్యటిస్తూ ఓటర్లను కలవాలని, కూటమి అభ్యర్థి తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. మండలంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి!

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ఆలమూరు, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు ప్రజలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఆలమూరు మండలంలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చొప్పెల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకుడు సుంకర శ్రీరాములుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వేగం పుంజుకుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని, పాలనాపరమైన సమస్యలను సరిదిద్దడానికి రెండేళ్ల నాలుగు నెలల సమయం పట్టిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి, మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.

హామీల అమలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అమరావతి రాజధాని నిర్మాణ పనులను తిరిగి వేగవంతం చేశామని, పోలవరం ప్రాజెక్టు పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ప్రస్తుతం గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు భారీ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.వైసీపీ పాలనలో యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడే పరిస్థితులు నెలకొంటే, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వాటిని నియంత్రిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు, అప్పులు తప్ప గత పాలనలో అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు.అర్నబ్ తుఫాన్ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపు, అనుభవంతో అధికార యంత్రాంగాన్ని ముందుగానే అప్రమత్తం చేయడం వల్ల రాష్ట్రంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులను ఎదుర్కోగలిగామని ఎమ్మెల్యే అన్నారు. 1996 హరికేన్ తరహాలో విపత్కర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వం ఉండటం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం దెబ్బతింటుందని వైసీపీ నాయకులు ఆశించినప్పటికీ, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా మూడు పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో టీడీపీ ఆలమూరు జెడ్పీటీసీ అభ్యర్థి దొండపాటి సుబ్బరాజు, చొప్పెల్ల ఎంపీటీసీ-1 జనసేన అభ్యర్థి సూరపురెడ్డి జయలక్ష్మి, ఎంపీటీసీ-2 టీడీపీ అభ్యర్థి మేరేటి సాయి దుర్గ, ఎంపీటీసీ-3 టీడీపీ అభ్యర్థి సింగంశెట్టి రమ్య పాల్గొన్నారు.అలాగే కూటమి నాయకులు సలాది నాగేశ్వరరావు, మెర్ల గోపాలస్వామి, ఈదల సత్తిబాబు, సూరపురెడ్డి సత్య, ఆకుల రామకృష్ణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, బళ్ల హరికృష్ణ, సకుమళ్ల రాముడు, మద్ది సతీష్, ఆకుల అన్నవరం, నాగిరెడ్డి మహేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు ఆదేశాల మేరకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు సహాయ సామగ్రిని అందజేశారు. బాపట్ల పట్టణంలోని మూడో వార్డుకు చెందిన కె. ప్రసన్న నివాసముంటున్న పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లోని సామగ్రి సైతం అగ్నికి ఆహుతైంది.విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి. రమణబాబు, జె. సత్యనారాయణ రాజు, డీఎఫ్ఓ రాజేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయంగా గృహోపకరణాలు, టార్పాలిన్ పట్టా, దుప్పట్లు

అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి అవసరమైన సహాయం అందించారు.

తుపాను దెబ్బతిన్న వరి పొలాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన

ఆరు బృందాలుగా పలు గ్రామాల సందర్శన. రైతులకు పంటల రక్షణపై సూచనలు

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని ఆందోళనలో ఉన్న రైతులకు అండగా నిలిచేందుకు బాపట్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. అర్నబ్ తుపాను కారణంగా వరి పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంతో పాటు, పంటలను తిరిగి సంరక్షించుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కూడిన బృందాలు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పొలాలను పరిశీలించాయి.ఏలూరు జిల్లాలోని వెంకటాపురం, పోతన్నూరు, కొవ్వలి, కొల్లిపర గ్రామాల్లో శాస్త్రవేత్తలు పర్యటించి తుపాను ప్రభావానికి గురైన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల పరిస్థితిని రైతులతో కలిసి సమీక్షించి, ప్రస్తుత దశలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, తదుపరి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు సూచించారు.ఇదే విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరప్పాడు, రావులపాలెం గ్రామాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఉండి, రాజమహేంద్రవరం, పెద్దాపురం పరిసర ప్రాంతాల్లోనూ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలు పర్యటించాయి. మొత్తం ఆరు బృందాలుగా ఏర్పడి సుమారు 250 మంది విద్యార్థులతో కలిసి క్షేత్రాలను సందర్శించడం విశేషం.సేద్య, వ్యవసాయ విస్తరణ, కీటక శాస్త్రం, వ్యవసాయ ఆర్థిక శాస్త్రం, ఉద్యానవనం, ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ విభాగాలకు చెందిన నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డా. కె. శ్రీనివాసులు, డా. మండవ శ్రీనివాసరావు, డా. ఎం. ఉష, డా. ఆర్. బాల మురళీధర్ నాయక్, డా. బండి అపర్ణ, డా. ఎన్. రత్నకుమారి, డా. వై. సునీత, డా. అబ్దుల్ సలామ్ బృందాలకు నాయకత్వం వహించారు.ఏలూరు జిల్లా పర్యటనలో డా. ఎన్. రత్నకుమారి, డా. బి. అపర్ణ, డా. కె. మాధురి మణి, జిల్లా వ్యవసాయ సలహా మరియు సాంకేతిక బదిలీ కేంద్రం కోఆర్డినేటర్ డా. ఫణికుమార్, డా. నాగేంద్రబాబు, దెందులూరు సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. తుపాను అనంతరం పంటల పునరుద్ధరణలో రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు.

ఏలేశ్వరంలో కూటమి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ తంగెళ్ళ, ఎమ్మెల్యే సత్యప్రభ

--భారీ ర్యాలీ, బహిరంగ సభతో హోరెత్తిన ఏలేశ్వరం టౌన్
-- ఏలేశ్వరం మున్సిపాలిటీని జిల్లాలోని రోల్ మోడల్ గా చేస్తా
-- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

కాకినాడ జిల్లా అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం చివరి రోజు కూటమి పార్టీల శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కూటమి చైర్మన్ అభ్యర్థి యార్లగడ్డ అక్షిత, 28 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. అనంతరం బాలాజీ చౌక్ సెంటర్‌లో బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు హాజరయ్యారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఏలేశ్వరం-జడ్డంగి అన్నవరం రోడ్డు పనులు ప్రారంభించామని, నెల రోజుల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. అప్పనపాలెం వంతెన పునర్నిర్మాణానికి కూడా త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంతెన నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని పేర్కొన్నారు. అలాగే తూర్పు కాపు, ఎస్సీ, ఆర్యవైశ్య కమ్యూనిటీలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం ఎంపీ గ్రాంట్ల ద్వారా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని, స్థల పరిశీలన పూర్తయిన వెంటనే శంకుస్థాపనలు చేపడతామని హామీ ఇచ్చారు. కూటమి చైర్మన్ అభ్యర్థి యార్లగడ్డ అక్షితతో పాటు 28 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీ, ఎమ్మెల్యే ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కుండల సాయికుమార్ సాయి కుమార్, నీరుకొండ సత్యనారాయణ, వరుపుల సూరిబాబు, పెంటకోట మోహన్, పైల సుభాష్ చంద్రబోస్,వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, రుచి రమేష్, పలివెల వెంకటేష్, అనంతారపు రాజు, గట్టెం వెంకటరమణ,అలమండ మధు, సామంతుల గోపి, గొల్లపూడి త్రిమూర్తులు, పాండ్రింకి రామ్మోహన్రావు, పెంద్ర శ్రీను, బుగత శ్రీను, ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ కొల్లా శ్రీనివాస్ తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ఐక్యంగా కూటమి.. గెలుపే లక్ష్యం

నూటికి వెయ్యి శాతం గెలుపుపై ధీమా. అభివృద్ధే మూడు పార్టీల ఉమ్మడి అజెండా

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి) బాపట్ల నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను నూటికి వెయ్యి శాతం గెలిపించుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు పార్టీల మధ్య పరస్పర గౌరవం, సమన్వయం ఉండేలా ఇప్పటికే నాయకుల స్థాయిలో చర్చలు జరిపినట్లు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో ముందుకు సాగుతున్నామన్నారు. బాపట్ల మున్సిపాలిటీని బీజేపీకి కేటాయించామని, ఆ పార్టీ అభ్యర్థి విజయానికి కూటమి శ్రేణులంతా కలిసికట్టుగా కృషి చేస్తాయని చెప్పారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ, బీజేపీ జిల్లా నాయకత్వంతో కలిసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో ఎన్నికల వ్యూహాన్ని అమలు చేస్తామని వివరించారు. మున్సిపల్ ఎన్నికలతో పాటు సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మూడు పార్టీలకు రాజకీయ ప్రయోజనాల కంటే బాపట్ల నియోజకవర్గ అభివృద్ధే ప్రధానమని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల అభివృద్ధికి అవసరమైన నిధులు అందక, వచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించుకోలేకపోయారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. గతంలో మాదిరిగా ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా కూటమి నాయకులంతా సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.జనసేన నియోజకవర్గ సమన్వయకర్తనామన వెంకట శివనారాయణ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఐక్యతతో ప్రజల విశ్వాసాన్ని చూరగొందని, అదే స్ఫూర్తిని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగి స్తామని అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే భారీ మెజార్టీ తో విజయం సాధించడంలో కూటమి పార్టీల సమష్టి కృషి ఉందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా పార్టీ అధిష్ఠానాల ఆదేశాల మేరకు అభ్యర్థుల విజయానికి పనిచేస్తామని స్పష్టం చేశారు. గత పాలనలో కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం పూర్తిస్థాయిలో వినియోగించుకో లేకపోయారని విమర్శించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీటి సౌకర్యం కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం వంటి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి కొండారెడ్డి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరిస్తూ అభివృద్ధి కార్య క్రమాలకు నిధులు అందిస్తోందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలన్నా కూటమి అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు ఇక్కుర్తి లక్ష్మీనర సింహా, బీజేపీ నాయకులు మురళి, వెంకయ్యనాయుడు, శ్రీనివా సరాజు, కోటేశ్వరరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

జెల్లిపల్లిలో స్వతంత్ర అభ్యర్థి సునందమ్మ ముమ్మర ప్రచారం..

బీరువా గుర్తుపై ఓటేసి గెలిపించండి.. సెగ్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తా: సునందమ్మ

కంబదూరు అక్టోబర్30:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంబదూరు-1వ సెగ్మెంట్ ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థి, కుర్లపల్లి గ్రామానికి చెందిన జి. సునందమ్మ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని జెల్లిపల్లి గ్రామంలో మద్దతుదారులు, అభిమానులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా సునందమ్మ మాట్లాడుతూ.. తాను స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచానని తెలిపారు. సెగ్మెంట్ ప్రజలు తనపై నమ్మకం ఉంచి, ఆదరించి బీరువా గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తే సెగ్మెంట్‌లోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, మౌలిక వసతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సునందమ్మ తెలిపారు.ఆమె ప్రచారానికి మద్దతుదారులు, అభిమానులు ఉత్సాహంగా తరలివచ్చి ఓటర్లను కలిసి బీరువా గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

3వ సెగ్మెంట్ లో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి పి.దాదు విస్తృత ప్రచారం..

మూడో సెగ్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

ఇంటింటి ప్రచారంలో ఓటర్లకు పి.దాదు విజ్ఞప్తి

కంబదూరు అక్టోబర్:30(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,కంబదూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంబదూరు-3వ సెగ్మెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పి. దాదు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కంబదూరు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి తనకు మద్దతు తెలిపి ఎంపీటీసీగా గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా దాదు మాట్లాడుతూ.. ఎంపీటీసీగా తనకు అవకాశం కల్పిస్తే మూడో సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు, గ్రామాల్లోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఆదరించి గెలిపించాలని ఓటర్లను దాదు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా... జెడ్పీటీసీ అభ్యర్థి లోలుగు ధనలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థి దుంపల జయశ్రీ

- జోరువానలోనూ ఆగని వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం
- తోలాపి గ్రామంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం
- ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించిన అభ్యర్థుల ప్రతినిధులు దుంపల రామారావు , లోలుగు కాంతారావు

పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్: ప్రజాసేవే లక్ష్యంగా. పొందూరు మండల అభివృద్ధే ధ్యేయంగా జెడ్పీటీసీ అభ్యర్థి లోలుగు ధనలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థి దుంపల జయశ్రీ ముందుకు సాగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా పొందూరు మండలం తోలాపి గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు జోరువానను సైతం లెక్కచేయకుండా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్షం కురుస్తున్నప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను కలుసుకున్నారు.పొందూరు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోలుగు ధనలక్ష్మి ప్రతినిధి వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోలుగు కాంతారావు, తోలాపి ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో ఉన్న దుంపల జయశ్రీ ప్రతినిధి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) దుంపల రామారావు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మమేకమయ్యారు.వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీటీసీ అభ్యర్థి దుంపల జయశ్రీని, జడ్పీటీసీ అభ్యర్థి లోలుగు ధనలక్ష్మి లను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అరాచక పాలన కొనసాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి మధ్యగల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని , వైసీపీ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్‌గా ప్రజల కష్టాలు దగ్గరగా చూశా.. ఎంపీటీసీగా గెలిపిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతా: కూనవరం-1 టీడీపీ అభ్యర్థి కొయ్యల కనక లక్ష్మి ప్రసన్న

కూనవరం అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) కూనవరం మండలం కూనవరం-1 ఎంపీటీసీ ఎన్డీఏ బలపర్చిన టీడీపీ అభ్యర్థి కొయ్యల కనక లక్ష్మి ప్రసన్న ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో గ్రామ వాలంటీర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో ప్రజల కష్టసుఖాలు ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. వృద్ధుల పెన్షన్లు, మంచినీటి ఎద్దడి, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల సమస్య వంటి అనేక సమస్యలపై తనకు క్షేత్ర స్థాయి అవగాహన ఉందన్నారు.సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా అర్హులందరికీ అందాలంటే నిజాయితీగా పనిచేసే వ్యక్తి కావాలి. వాలంటీర్‌గా నాకు ఆ అనుభవం ఉంది. ఎంపీటీసీగా గెలిపిస్తే అధికారంతో పాటు బాధ్యతగా ప్రతి సమస్యను మండల అధికారుల దృష్టికి, పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి తీరుతా" అని ఆమె స్పష్టం చేశారు.ప్రస్తుతం స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడద సమస్య తన దృష్టికి వచ్చిందని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జడ్పిటిసి అభ్యర్థి పాయం వెంకయ్య టిడిపి సీనియర్ నాయకులు పోడియం అప్పారావు భరపాటి ప్రకాశరావు, చెలికాని ఉమా, షరీఫ్ హెచ్ రాము హెచ్ రవి జనసేన మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, మాజీ సర్పంచ్ హేమంత్, సాయి, సింగడాల సాయి తేజ, గడ్డం వంశి, మేడిది నాగార్జున, దగ్గుపల్లి ప్రవీణ్, మట్ట రమేష్, చుండూరి ఉదయ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు

కూటమి అభ్యర్థులను గెలిపించి ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు బాటలు వేయండి!ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలో జడ్పీటీసీ అభ్యర్థి దొండపాటి సుబ్బరాజుతో పాటు మొత్తం 21 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ధీమా వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బడుగువానిలంక గ్రామం నుంచి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకుడు తమలంపూడి రామకృష్ణారెడ్డి తదితర కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే, కూటమి నాయకుల ప్రచారానికి గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచులు, ఎంపీటీసీలకు కనీస గౌరవం కూడా దక్కలేదని, ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేశామని వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తోందని కొనియాడారు. గతంలో ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేసి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు.వైసీపీ పాలనలో గంజాయి, మత్తు పదార్థాల సమస్య పెరిగిందని, కూటమి ప్రభుత్వం వాటి నియంత్రణకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు

యువత భవిష్యత్తు బాగుండాలంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొనసాగాలని అన్నారు.

ప్రతి స్థానంలో ఐక్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలో ఏ పార్టీ అభ్యర్థి పోటీలో ఉన్నప్పటికీ మిగిలిన పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అన్ని స్థానాల్లో విజయం సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి అయితే, అరాచకానికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని విమర్శించారు. గ్రామాల్లో ప్రచారానికి వెళ్తున్నప్పుడు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, కూటమి అభ్యర్థులు నూటికి నూరు శాతం విజయం సాధిస్తారనే నమ్మకం ఉందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

నా పై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం

- వైసీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) బద్వేల్ జడ్పిటిసి నామినేషన్ ఉపసంహరణ విషయంలో నేను డబ్బులు తీసుకున్నానని కొందరు టీడీపీ నాయకులు, నా రాజకీయ ఎదుగుదల ను ఓర్వలేని కొందరు వ్యక్తులు రెండురోజుల నుండి సోషల్ మీడియా గ్రూపులలో నాపై విషప్రచారం చేయడం చాలా బాధాకరమని వైసీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న నాగభూషణం ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా నేను డబ్బులు తీసుకున్నానని నిరూపిస్తే రాజకీయాలనుండి నుండి తప్పుకుంటానని, తప్పుడు ప్రచారం చేసే వ్యక్తులు మాడికోనయ్య స్వామి వద్దకు వచ్చి ప్రమాణం చేసి డబ్బులు ఇచ్చినట్టు నిరూపించాలని లేకపోతే వారు రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటారా, లేదంటే మీడియా ముందుకు వచ్చి క్షమాపణ చెబుతారా అని ప్రశ్నించారు. అలా చెప్పలేని పక్షంలో వారికి రాజకీయాలు చేసే అర్హత కూడా లేదన్నారు. రాజకీయాలంటే సేవా భావంతో చేయాలే గాని ఒక యువ నాయకుడుగా నేను ఎదుగుతున్నాననే దురుద్దేశంతో నాపై ఇలాంటి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. మీరు నిజంగా రాజకీయం చేయాలంటే జరగబోయే జడ్పిటిసి ఎన్నికలలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిపించాలన్నారు. ఎంపీటీసీ ,జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ ,మున్సిపల్ చైర్మన్ పదవులు సంతలో పశువులను అమ్మినట్టుగా అమ్ముకున్నారన్నారు. రాబోయే సర్పంచ్ ఎలక్షన్ లు, ఇప్పుడు జరుగుతున్న జడ్పిటిసి ఎలక్షన్లు ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా మీరు ప్రజాస్వామ్యబద్ధంగా గెలిస్తే అప్పుడు మీరు నిలిచినట్లని, లేకపోతే మీరు ఓడినట్టెనన్నారు. అలాగే నేను కొద్ది రోజుల క్రితం అట్లూరు మండలానికి చెందిన బోవిల్ల సూరారెడ్డి వైసీపీ నుండి టిడిపిలోకి వెళుతున్నారన్న సమాచారంతో ఆయన స్వగృహం నందు నేను అతనిని కలవడానికి వెళ్లగా అదే సమయంలో సూర్యనారాయణ రెడ్డి కూడా అక్కడికి రావడం జరిగిందని, సూర్య నారాయణరెడ్డి నన్ను కూడా పార్టీలోకి రమ్మన్నారని, నేను ఎప్పటికీ పార్టీ మారనని చెప్పడం జరిగిందన్నారు. అప్పుడు వాళ్లతో మాట్లాడే సందర్భంలో ఎవరో వీడియో కాల్ చేసి ఆ ఫోటోలో, నేను ఉన్న ఫోటోలు స్క్రీన్ షాట్ చేసి సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారన్నారు. వీడియో కాల్ చేసిన వ్యక్తి మేము మాట్లాడే మాటలు ఏవైనా మంతనాలు జరిపినట్టు ఉంటే కూడా బయట పెట్టాలన్నారు అలా అనుకోకుండా ఆ సంఘటన జరిగిందే,కానీ ఉద్దేశపూర్వకంగా జరగలేదన్నారు. బద్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధా,ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, యువ నాయకులు ఆదిత్యా రెడ్డివెంటే నడుస్తామని నేను ప్రాణం ఉన్నంత వరకు వైసీపీ పార్టీని వీడేది లేదన్నారు. బద్వేల్ ప్రాంత ప్రజలు, ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు విజయ్ నరసింహారెడ్డి ప్రతాప్ రెడ్డి, ప్రణీత్, సునీల్, రెడ్డప్ప రెడ్డి, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిలు గెలుపే లక్ష్యంగా టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు విస్తృత ప్రచారం

కుంకునూరు ఎస్సీ కాలనీ మరియు బీసీ కాలనీలో తరపున విస్తృత ప్రచారం

దేవనకొండ : అక్టోబర్ 30 ప్రజా జ్యోతి న్యూస్ వీజ రాఘవేంద్ర స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని కుంకునూరు ఎంపీటీసీ పోటీ చేస్తున్న జి జంగలి శివశంకర్ మరియు జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ షేక్ సాదిక ఎంబీబీఎస్ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కుంకునూరు గ్రామంలో విస్తృతంగా నాయకులు కార్యకర్తలు పర్యటించారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కలుసుకొని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి ప్రజలు సంక్షేమ లక్ష్యంగా కూటమి పనిచేస్తుందని స్థానిక సంస్థలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి వారి సమస్యల పరిష్కరించడానికి కృషి చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలలో కొనసాగేందుకు మద్దతు తెలుపలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రచార ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మన్న రాజగోపాల్ గౌడ్ ఆర్ రామప్ప రెడ్డి మరియు జనసేన నాయకులు వీ. రామ్ లక్ష్మన్న, లింగ, మరియు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి...రౌడూర్ వైసిపి నాయకులు

కౌతాళం అక్టోబర్ 30 ప్రజా జ్యోతి కౌతాళం మండల పరిధిలోనే రౌడీ గ్రామంలో శుక్రవారం రోజున ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారాయణప్పను గెలిపించండి. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వార్డులోని ఓటర్లను, స్థానిక ప్రజలను కలుసుకొని వైసీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రౌడూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని ప్రజలకు తెలియజేశారు. అప్పుడు అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వైసీపీ అభ్యర్థి నారాయణప్పకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తులపై ఓటు వేసి వేయించి గెలిపించాలని ప్రచారంలో ప్రజలను కోరారు. ఈఎన్నికల ప్రచారంలో ఆర్.ఎం సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి,కిష్టప్ప తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించండి నామా సురేంద్ర కుమార్

తాళ్లపూడి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి న్యూస్ నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న కంఠమణి విజయలక్ష్మిని మరియు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు గెలిస్తే కొవ్వూరు మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందుతుందని గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తారని అన్నారు. టిడిపి సీనియర్ పెండ్యాల అచ్చిబాబు, మద్దిపట్ల శివరామకృష్ణ, కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయి చౌదరి, సూరపనేని చిన్ని లు కొవ్వూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని వారి నాయకత్వంలో కొవ్వూరు మరింత ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. కావున ఓటర్లందరూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు

తాళ్లపూడి ఎంపీటీసీ-1 లో వైసీపీ అభ్యర్థి మైగాపుల ఆంజనేయులు ఇంటింటి ప్రచారం

తాళ్లపూడి,అక్టోబర్ 30, ప్రజాజ్యోతి న్యూస్ ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో తాళ్ల పూడి మండలం తాళ్లపూడి ఎంపీటీసీ-1 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైగాపుల ఆంజనేయులు తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలో అందరితో సన్నిహిత సంబంధాలు మాస్ లో మంచి పట్టు ఉన్న ఆంజనేయులుకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోంది. గడపగడపకు తిరుగుతూ వైఎస్ఆర్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. "ఫ్యాన్ గుర్తుకే మన ఓటు – అభివృద్ధికి మన బాట" అనే నినాదంతో ప్రచారం సాగింది. జగనన్న ఆశయ సాధన కోసం పేదల సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తును గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో స్థానిక యువత పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంబోలు పోసి బాబు, గూడా విజయ రాజు, డి.వి. సత్యనారాయణ, గోలి అన్నవరం, యడ్ల నాగబాబు, దూడల భద్రం, వెంపా జయసూర్య, నవీన్ మరియు వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

3వ సెగ్మెంట్ లో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి పి.దాదు విస్తృత ప్రచారం

మూడో సెగ్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా.. ఇంటింటి ప్రచారంలో ఓటర్లకు పి.దాదు విజ్ఞప్తి

కంబదూరు అక్టోబర్:30(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంబదూరు-3వ సెగ్మెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పి. దాదు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కంబదూరు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి తనకు మద్దతు తెలిపి ఎంపీటీసీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా దాదు మాట్లాడుతూ.. ఎంపీటీసీగా తనకు అవకాశం కల్పిస్తే మూడో సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు, గ్రామాల్లోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఆదరించి గెలిపించాలని ఓటర్లను దాదు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

చింతూరు అక్టోబర్ 30 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు శ్రీమతి గొర్ల సునీత ఈ రోజు పోలవరం జిల్లా చింతూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య విభాగాల పనితీరుపై వివరాలను సూపరింటెండెంట్ డా శివకుమార్ ని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నవజాత శిశువుల సంరక్షణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం లో అందిస్తున్నా సేవలు గురించి డా మహేష్, చిన్నపిల్లల వైద్య నిపుణులు గౌరవ సభ్యులకు వివరించారు. డయాలసిస్ కేంద్రం లో చికిత్సా పొందుతున్న రోగులతో ఆమె మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు, ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలు, ఇతర వైద్య విభాగాల ద్వారా గిరిజన ప్రాంత ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే ఆసుపత్రిలో రోగులకు అందిస్తున బోజన సదుపాయాలను ఆమె పరిశీలించారు, రోగులకు నాణ్యమైన, మెనూ ప్రకారం డైట్ సప్లయ్ చేయాలని సూచించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంచడం, ముఖ్యంగా తల్లులు మరియు నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. చింతూరు వంటి మారుమూల గిరిజన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రి సిబ్బంది కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షణ వైద్యాధికారి డా. శివకుమార్, డా. రమణ రావు, డా జలపతి, డా శశికళ, డా మాధవి డీఈఓ శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదు - ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని, అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం బాపట్ల ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బాపట్ల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఆరు జడ్పీటీసీ, 85 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మొత్తం 164 పోలింగ్ ప్రదేశాల్లో 26 సెన్సిటివ్, 28 హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్ అధికారులు గ్రామాలను సందర్శిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, పాత నేరస్థులను గుర్తించి ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల విధుల కోసం 33 మొబైల్ పార్టీలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎస్ఎస్టీ, ఎంసీసీ, వీడియో సర్వైలెన్స్ బృందాలు, స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ బలగాల మధ్య సమన్వయం కోసం రూపొందించిన సమర్థ్ మొబైల్ యాప్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ద్వారా సమాచారం కంట్రోల్ రూమ్‌కు చేరుతుందని, సమీప పోలీస్ బృందాలు వెంటనే స్పందించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, ఎన్నికల సమయంలో సమస్యలు ఎదురైతే పోలీసులకు లేదా 112కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అవకాశవాదులను మండల పీఠంపై కూర్చోబెడతారా

ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మాజీమంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి.

ముత్తుకూరు, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి) అవకాశవాదులు , పార్టీలు మారే నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించి ముత్తుకూరు మండల ప్రజా పరిషత్ పీఠంపై కూర్చో పెడతారా అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులను ఉద్దేశించి రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉగ్రరూపం చూపారు. శుక్రవారం ఆయన మండలంలోని పొట్టెంపాడు, బ్రహ్మదేవి, జంగాల కండ్రిగ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎంపిటిసి అభ్యర్థులను గెలిపించి జెడ్పిటిసి గెలిపించి విజయాన్ని చేకూర్చాలని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని ఆయా గ్రామాల ప్రజలను కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీపీ అభ్యర్థిగా ఉన్నారని ఆయన ప్రకటించారు. అనంతరం ఆయన చేసిన రాజకీయ ప్రసంగం ఓటర్లను ఆలోచింపజేసింది. మంచి కుటుంబం వ్యక్తిని మండల పీఠంపై కూర్చోబెడతారా పార్టీలు మారేవారిని కూర్చోబెడతారా అనేది జనం నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ నాయకులు ఏదో చెబుతున్నారని ఆయన ఆగ్రహం చూపారు. వైసిపి అధికారంలోకి వస్తే అక్కడికి వెళ్తామని చెబుతున్నారని ఎట్టి పరిస్థితుల్లో వైసీపీలోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ఒకటైన అమలు చేసిందా అని సమాధానం చెప్పగలరా అంటూ అధికార పార్టీ నాయకులను ఆయన ప్రశ్నించారు. కరువు, దోపిడి ,కమిషన్లు, ఎన్నికల హామీలు మోసాలు, అక్రమాలు తోపాటు అరాచకాలు ఉన్నాయని విమర్శించారు. వైకాపా కార్యకర్తలు జోలికి వస్తే ఒక్కొక్కరు అంతు చూస్తామన్నారు. అధికారంలో ఉన్న కొంతమంది నాయకులు ఎగిరెగిరి పడుతున్నారని వైసీపీ అధికారం వచ్చిన తర్వాత ఎగురుతూ ఎగురుతూ వెళ్తారని మాజీ మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కంబదూరులో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఇబ్రహీం వలి ఇంటింటి ప్రచారం జోరు

సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించండి..

సెగ్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తా: ఇబ్రహీం వలి

కంబదూరు అక్టోబర్:30(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,కంబదూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంబదూరు-3వ సెగ్మెంట్ టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఇబ్రహీం వలి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కంబదూరు గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ఓటర్లకు వివరించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఇబ్రహీం వలి మాట్లాడుతూ.. ఎంపీటీసీ అభ్యర్థిగా తనకు ఒక అవకాశం కల్పించి గెలిపిస్తే కంబదూరు-3వ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణతో తనను గెలిపించాలని, ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి మద్దతు తెలపాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు.

రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వన్ వే

హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిత్యం వేలాది మంది టెక్కీలను, వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రెండు ప్రధాన జంక్షన్లలో త్వరలోనే వన్ వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించిన అధికారులు, వన్ వే విధానం అమలు సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో కేబీఆర్ పార్క్ వద్ద అమలు చేసిన వన్ వే వల్ల దాదాపు 6 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేయాల్సి రాగా, ఇక్కడ మాత్రం వాహనదారులకు కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అదనపు ప్రయాణ భారం పడనుంది. ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల వల్ల ఐటీ కారిడార్‌లో కనీసం 40 శాతం మేర ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దశలవారీగా చేపట్టనున్న ఈ ప్రణాళికలో భాగంగా.. తొలుత వారం, రెండు వారాల వ్యవధిలోనే రాయదుర్గం జంక్షన్ పరిసరాల్లో వన్ వే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక జంక్షన్‌లోనూ దీనిని విస్తరిస్తారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగులకు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమీపంలోని కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, మాల్స్, విద్యాసంస్థల యాజమాన్యాలకు ముందస్తు సమాచారం అందించి వారిని సమాయత్తం చేస్తున్నారు. మరోవైపు, పీక్ అవర్లలో ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ఆర్టీసీతో చేతులు కలిపిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. వినూత్నంగా కాంట్రా ఫ్లో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రవేశపెట్టనున్నారు. తీవ్ర రద్దీ ఉండే జేఎన్‌టీయూ, హఫీజ్‌పేట్, రాయదుర్గం జంక్షన్లను గుర్తించి, జేఎన్‌టీయూ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అలాగే తిరుగు ప్రయాణంలో ఈ బస్సులను నడపనున్నారు. వన్ వే అమలయ్యే రూట్లలో క్లాక్‌వైజ్ , యాంటీ క్లాక్‌వైజ్ దిశల్లో ఎలాంటి మధ్యంతర హాల్ట్‌లు లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా వీటిని డిజైన్ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ దాదాపు 20 నుంచి 30 ప్రత్యేక బస్సులను కేవలం ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసమే రంగంలోకి దించనుంది. కేవలం వాహనాల కదలికలే కాకుండా.. ప్రధాన రహదారులపై మనుషులు అడ్డదిడ్డంగా దాటడం వల్ల వాహనాల వేగం మందగించి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ పరిధిలోని పలు కీలక కూడళ్లలో అత్యాధునిక స్కైవాక్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాదచారులు రోడ్లపైకి రాకుండా పైనుంచే సురక్షితంగా వెళ్లేలా స్కైవాక్‌లను అనుసంధానించడం ద్వారా పాదచారుల భద్రత పెరగడంతో పాటు, రహదారులపై వాహనాల రాకపోకలు నిరంతరాయంగా సాగి నగరవాసులకు ట్రాఫిక్ నరకం నుంచి భారీ ఉపశమనం లభించనుంది.

సైకిల్ గుర్తుతోనే కరణాల వీధి సంక్షేమం.

ముత్తుకూరు, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) సైకిల్ గుర్తుతోనే కరణాల వీధి సంక్షేమం సాధ్యమవుతుందని కృష్ణపట్నం బిట్-1 తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గూడలి రేవతి అన్నారు. శుక్రవారం రాత్రి ఎంపిటిసి అభ్యర్థి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. మహిళలు ఆదరించి అభిమానించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో పోటీ చేస్తున్నామని ఇంటింటి ప్రచారంలో తెలియజేశారు. ఈ ప్రచారానికి విశేషంగా స్పందన లభించింది. ఈ కార్యక్రమం లో అధికార పార్టీ నాయకులు మామిడాల శ్రీనివాసులు, రాగాల శివకృష్ణ, కారంచేటి శివరామ ప్రసాద్ శర్మ, గూడలి మధుసూదన్ రావు శర్మ, గోవిందయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కూటమి అభ్యర్థులు గెలిపి లక్ష్యంగా టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు ప్రజలు విస్తృత ప్రచారం

దేవనకొండ: అక్టోబర్ 30 ప్రజా జ్యోతి న్యూస్ రాఘవేంద్ర కూటమిలో భాగంగా కొత్తపేట పొట్లపాడు జనసేన ఎజ్ఞాఫ అభ్యర్థి ప్రశాంతి గారూ, ్లాజ అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక ఎంబీబీఎస్ గారు తరపున ఆలూరు ఇంచార్జి వెంకప్ప గారి ప్రచారం ముమ్మరంగా సాగింది దేవనకొండ మండలం పొట్లపాడు కొత్తపేట గ్రామంలో విస్తృతంగా నాయకులు ప్రచారం చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి పని చేస్తుందని స్థానిక సంస్థలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేందుకు కూటమి అభ్యర్థులకు ఓటు వేసి మద్దతు తెలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్లపాడు సుధాకర్, వెంకటేష్ పెద్ద గోవిందు, భూపాల్ పరమేష్ మరియు బిజెపి నాయకులు కొత్తపేట మహేష్ వెంకటేష్ బజారి మరియు జనసేన నాయకులు బడేసాబ్ రామలక్ష్మణ్ లింగమూర్తి రామకృష్ణ వీరేష్ కృపాకర్ మరియు టిడిపి నాయకులు పొట్లపాడు సుధాకర్ వెంకటేష్ పెద్దగోవిందు భూపాల్ పరమేష్ మరియు బీజేపీ నాయకులు కొత్తపేట మహేష్ వెంకీటేష్ బజారి ప్రచారంలో పాల్గొన్నారు.

ఆదరించి గెలిపించండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తా -తొండమనాటి

ముత్తుకూరు, అక్టోబర్,30 (ప్రజా జ్యోతి) కృష్ణపట్నం స్థానిక ఎంపీటీసీ,ఎన్నికల్లో బిట్-1 స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు తమను ఆదరించి గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని గౌను గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి తొండమనాటి కామాక్షి ఓటర్లను కోరారు, శుక్రవారం సాయంత్రం గ్రామంలోని యాదవ వీధిలో అభ్యర్థి ఇంటింటా ప్రచారం నిర్వహించారు, వై కోదండ రామయ్య, తొండమనాటి శ్రీధర్, కరణం ఏడుకొండలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న కామాక్షిని గౌను గుర్తు పై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధి కి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు,ఈ కార్యక్రమంలో, ఆక్షశయ్య, కరణం సుబ్రహ్మణ్యం కె.శ్రీరాములు,కె బాలాజీ, కరణం హరి,కే,సురేంద్ర టీ, వాసు,తదితరులు పాల్గొన్నారు

జడ్పిటిసి అభ్యర్థి అక్క మహాదేవి ఇంటింటి ప్రచారం

నందవరం,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): జడ్పిటిసి అభ్యర్థి అక్కమహాదేవి ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. మండల పరిధిలోని ముగతి, హాలహర్వి,మిట్టసోమాపురం గ్రామంలో శుక్రవారం కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) సీనియర్ నాయకులు బండే గురుస్వామి, మాచాపురం కాసిం వలి, రైస్ మిల్ నారాయణరెడ్డి,ముగతి ఈరన్న గౌడ్, ఏ ఎంసి చైర్మన్ గోపాల్ గురజాల పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థి చార్లెస్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి చూసి ఓటు వేయండి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ముందుగా గ్రామంలోని లింగమయ్య స్వామికి పూజలు నిర్వహించి, అనంతరం సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిట్ట సోమాపురం వీరేష్, హాలహర్వి ఎర్రన్న,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ : దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ఫ్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం. ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ మలక్పేట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్య నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీ నిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు. గుడిమల్కాపూర్, కిషన్బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

మచిలీపట్నంలో వర్ష బీభత్సం..
రెండు రోజులైనా తగ్గని నీరు

జలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

మచిలీపట్నం అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మచిలీపట్నం నగరం జలమయమైంది. ఎటు చూసినా రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ రహదారులపై నీరు ఏమాత్రం తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు డ్రైనేజీలను తలపిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, రహదారులపై సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఒకవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు రెండు రోజులైనా రోడ్లపై నీరు తగ్గకపోవడం నగర ప్రజలకు మరింత భారంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరలో బల్లి

హైదరాబాద్ జేఎన్టీయూ మంజీర హాస్టల్లో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి కనిపించడం కలకలం రేపింది. గురువారం రాత్రి డిన్నర్ చేసేందుకు వెళ్లిన విద్యార్థులకు వడ్డించిన కూరలో బల్లి కనిపించడంతో వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే కూరలో ఉన్న బల్లిని సెల్ఫోన్లలో వీడియోలు తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆహారంలో బల్లి రావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్లో భోజన నాణ్యతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. హాస్టల్లో పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి

షాద్నగర్

బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. షాద్నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతో నిత్యం గొడవ పడేది. ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు, ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని, చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

ఏపీకి మళ్లీ వర్ష గండం

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి ఏపీ ఇంకా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో గంటకు 45?55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రంలో అలజడి ఉండే అవకాశం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం ఏర్పడటంతో కోస్తా జిల్లాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండండి.

పల్లె పల్లె వాడ వాడ ఎగురుతున్న ఎర్ర జెండా ప్రచారం...

చింతూరు అక్టోబర్ 30 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం మండలంలో మూడవరోజు సిపిఎం అభ్యర్థుల గెలుపు కొరకు పల్లె పల్లెల్లో వాడ వాడల్లో ఎర్రజెండా ఎగురుతూ ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. సిపిఎం చింతూరు జడ్పిటిసి అభ్యర్థి మీడియం శ్రీదేవి, ఎంపీటీసీలు సీసం సురేష్, మడకం రమేష్, సారమ్మ, కుంజ ప్రసాదు, కారం నాగేష్, బొక్కిలి కన్నారావు ప్రచారంలో పాల్గొని ప్రజలకు సిపిఎం పార్టీ పోరాటాలు గిరిజన హక్కులు పై అవగాహన కల్పిస్తూ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికి ప్రతి ఓటరు కలిసి అభ్యర్థించారు. కల్లేరు సెగ్మెంట్లో సూరన్న గొంది, తుమ్మల పంచాయతీలో వేకవారిగూడెం, ఏజీ కోడేరులో, ముకునూరు, పెదసిత్తనపల్లి పంచాయతీలలో సిపిఎం శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వాడవాడలా తిరుగుతూ పల్లె పల్లెల్లో ప్రతి ఒక్కరిని కలుస్తూ గత పాలకుల వివక్షతను వివరిస్తూ ఎర్రజెండా ప్రాముఖ్యతను అవగాహన కల్పిస్తూ కమ్యూనిస్టులు అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా ఒంటరిగా పోరాడుతున్న వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పోలవరం పరిహారం విషయంలో ప్రభుత్వాలను వైఫల్యం గిరిజనులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకుండా జీవో నెంబర్3 రద్దు చేసి గిరిజన జాతి మనుగడకు ముప్పు చేశారని అటవీ హక్కుల చట్టాన్ని కూడా అమలు చేయకుండా అడవిని అడవి బిడ్డలకు దూరం చేసి తీవ్ర అన్యాయం చేసిన ప్రభుత్వాలపై తిరగబడి గొంతు ఎత్తాలంటే ఎర్రజెండా ప్రజా ప్రతినిధులను గెలిపించాలన్నారు. నిత్యవసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో లేవని ఉప్పు పప్పులు కూడా కొనే పరిస్థితిలో లేదని విద్యుత్ బిల్లులు ఇష్టానుసారం పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని ఇటువంటి ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే ఓటుతోనే మన అభ్యర్థులను గెలిపించి తీరాలని ప్రచారంలో ప్రస్తావించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీనియర్ ఐద్వా సంఘం నాయకులు ము ర్రం రంగమ్మ, నాయకులు మొట్టం రాజయ్య, కారం సుబ్బారావు, పోడియం లక్ష్మణ్, పిడగయ్య, పాల్గొన్నారు.

తాడిపూడి లో కూటమి ఎంపీపీ, జడ్పిటిసి అభ్యర్థుల ప్రచార జోరు

తాళ్లపూడి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో కూటమి ఎన్నికల ప్రచారం శుక్రవారం జోరుగా సాగింది. టీడీపీ సీనియర్ నాయకులు నామా కొండబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ అభ్యర్థి నామా నాగ శంకర రాణి, జడ్పీటీసీ అభ్యర్థి కొక్కిరిపాటి అనంతలక్ష్మిలు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ టీవీ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధి చేస్తామని ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ, జనసేన నాయకులు కొలుకుల సత్యనారాయణ (పెద్దబ్బులు), కొక్కిరిపాటి పృథ్వీరాజ్, తిరుమలశెట్టి సత్యనారాయణ, ఆటపాకల శేఖర్, బీజేపీ నాయకులు తిరుమలశెట్టి కృష్ణ తదితరులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

పురుషోత్తపట్నంలో హోరెత్తిన వైఎస్సార్సీపీ ప్రచారం!

-- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన ఎంపీటీసీ అభ్యర్థి బొగ్గ అరుణ, జెడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి

-- మిత్రపక్షాల మద్దతుతో ఎన్నికల బరిలో అభ్యర్థులు

-- భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి

ఎటపాక, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరామ్నగర్ కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ అభ్యర్థి బొగ్గ అరుణ, జెడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి శుక్రవారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకున్నారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ మిత్రపక్షాల మద్దతుతో ముందుకు సాగుతున్న అభ్యర్థులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నాయకత్వంలో అమలు చేసిన నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాలతో కుటుంబాల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పులను గుర్తుచేస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచారానికి వెళ్లిన అభ్యర్థులకు గ్రామంలోని మహిళలు, స్థానిక ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో తమ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ అభ్యర్థి బొగ్గ అరుణకు, జెడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ స్థానిక ముఖ్య నాయకులు, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ మిత్రపక్షాల ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

అనంతపురం లో కూటమి పార్టీల బైక్ ర్యాలీ

ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు అనంతపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార చివరి రోజున నగరంలో కూటమి పార్టీల శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో కదం తొక్కాయి. ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతుగా నగరంలోని చారిత్రాత్మక టవర్ క్లాక్ సర్కిల్ నుండి గాంధీ బజార్ వరకు ఈ భారీ బైక్ ర్యాలీ అత్యంత వైభవంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు నాయకుల నినాదాలతో అనంతపురం వీధులు మార్మోగాయి. ఈ సుడిగాలి ప్రచార బైక్ ర్యాలీలో కేంద్ర మంత్రి తోఖన్ సాహు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రముఖ సినీ నటుడు బాబు మోహన్ కూటమి పార్టీల జిల్లా అధ్యక్షులు మరియు ఇతర ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరందరితో కలిసి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కమ్మూరు నాగరాజు ఈ ర్యాలీలో చురుగ్గా పాల్గొని కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కమ్మూరు నాగరాజు మాట్లాడుతూ అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి కూటమి పార్టీలతోనే సాధ్యమని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నగర రూపురేఖలు మారుస్తామని నేతలు హామీ ఇచ్చారు. ర్యాలీ పొడవునా ప్రజలు వ్యాపారులు కూటమి నాయకులకు ఘనస్వాగతం పలికారు.

ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మంచి మనస్సు చాటుకున్న బదినెహల్ గ్రామ పెద్దలు బి.లక్ష్మిరెడ్డి

కౌతాళం అక్టోబర్ 30 ప్రజా జ్యోతి బదినేహాలు జిల్లా పరిషత్ కన్నడ పాఠశాల విద్యార్థులు భీమవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మల్కం అనే ఈవెంట్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఉమా మరియు ఓంశ్రీ, పాల్గొన్నారు. ఆదోనిలో జరిగిన అథ్లెటిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ మీట్లో డిస్కస్ త్రోలో అండర్ -18 విభాగంలో టెన్త్ క్లాస్ కృష్ణవేణి పాల్గొన్నారు. వీటిలో పాల్గొన్న విద్యార్థులకు బధినేహాల్ గ్రామ పెద్దలయిన లక్ష్మిరెడ్డి గెలుపొందిన విద్యార్థులకు తనకు తోచిన ఆర్థిక సహాయం హెచ్ఎం. ఈరమ్మ, మరియు పిడి. రూప మరియు బసవరాజ్, ఆంజనేయులు ఇతర ఉపాధ్యాయులు చేతుల మీదుగా వారికీ ఇవ్వడం జరిగింది. ఈ బహుమతి ఇచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులు, గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులు బి. లక్ష్మిరెడ్డికీ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్ ఇంజిన్ సర్కార్తోనే స్వర్ణాంధ్ర సాధ్యం: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి.

ఎమ్మిగనూరు, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని ట్రిపుల్ ఇంజిన్ సర్కార్తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం 27 నెలల్లోనే 90 శాతం హామీలను అమలు చేసి, సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చిందని వివరించారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మాచాని సునీత, బీజేపీ నాయకులు లలిత్ జైన్, నరసింహులు, జనసేన నాయకులు కరణం రవి, రవి ప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంబీ మహేష్, ఉపాధ్యక్షుడు ముల్లా కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే బలం- ప్రజా సేవే లక్ష్యం

ప్రజల మధ్యకు వెళ్లి వాళ్ళని ఆప్యాయంగా

పలకరిస్తూ వారి అభిప్రాయాలను గౌరవిస్తూ

జి.కొండూరు :(అక్టోబర్ 30,ప్రజా జ్యోతి బ్యూరో ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్న వైయస్సార్ గ్రామ పంచాయితీ సెగ్మెంట్-1 ఎంపీటీసీ అభ్యర్థి టి.ఎల్ రాజు సతీమణి శ్రీమతి చాందిని పఠాన్ ఎమ్మెస్సీ బీఈడీ. ఎన్నికలంటే కేవలం ఓట్ల కోసమే కాదు ప్రచారం కోసం కాదు ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడం వారి అవసరాలను అర్థం చేసుకోవడం మరియు గుర్తించడం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చాందిని పఠాన్ గారు అంటున్నారు ప్రజల మధ్యలో అడుగులు ప్రతి గడపలో ఆప్యాయత పలకరింపులు ప్రతి కుటుంబంలో ఆత్మీయసంభాషణ మధ్య వీరి ప్రచారం సాగుతుంది ప్రజల ఆప్యాయతల పల కరింపుల మధ్య ప్రజల స్పందన మరింత ఉత్సాహాన్ని నింపుతుంది కార్యకర్తల కృషి నాయకుల సహకారం ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతున్న ఎన్నికల ప్రచారం. ప్రజల మనసు గెలుస్తూ ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైయస్సార్ గ్రామ పంచాయితీ సెగ్మెంట్ -1 ఎంపీటీసీ అభ్యర్థి.

బిజినెస్

మార్కెట్లో జోరుగా బియ్యం ధరలు

ప్రపంచ ఆహార ధాన్యాల మార్కెట్లో బియ్యం ధరలు ఊపందుకున్నాయి. అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతుండటం, సరఫరాలో నెలకొన్న అనిశ్చితి వల్ల ప్రపంచ మార్కెట్లో బియ్యం ధరలు హెచ్చవుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలోనే అగ్రగామి బియ్యం ఎగుమతి దేశమైన భారత్‌లో ధరలు నిలకడగా కొనసాగుతుండగా, మరో ప్రధాన ఎగుమతిదారు వియత్నాంలో ధరలు గత రెండేళ్ల గరిష్ట స్థాయికి సమీపంలో ట్రేడవుతుండటం గమనార్హం.

ధరల పెరుగుదలకు కారణాలు

ఆసియా మార్కెట్లలో వరి సాగుపై వాతావరణ పరిస్థితుల ప్రభావం, రవాణా, లాజిస్టిక్స్ వ్యయాలు పెరగడం వంటి అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా ఫిలిప్పీన్స్, ఆఫ్రికా దేశాలు, పశ్చిమాసియా నుంచి బియ్యానికి దిగుమతి డిమాండ్ స్థిరంగా కొనసాగుతోంది. దీనికి తోడు దేశీయంగా ఖరీఫ్ సీజన్ వరి సాగు విస్తీర్ణం, వర్షపాత సరళిలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా దిగుబడి అంచనాలపై ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో భారతీయ మార్కెట్లోనూ ధరలు పెరుగుతున్నాయి.

భారత మార్కెట్, ఎగుమతుల తీరు

ప్రపంచ మార్కెట్లో భారతదేశం తన పోటీతత్వాన్ని కాపాడుకుంటూనే నాణ్యమైన బాస్మతీయేతర, బాస్మతి బియ్యం ఎగుమతులను కొనసాగిస్తోంది. కొత్త పంట మార్కెట్లోకి వస్తున్నప్పటికీ దేశీయంగా మిల్లులు, ఎగుమతిదారుల మధ్య డిమాండ్ కారణంగా ధరలు మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా నాణ్యమైన బియ్యంకు అంతర్జాతీయంగా డిమాండ్ నెలకొనడంతో భారతీయ ఎగుమతిదారులు సానుకూల ధోరణిని కనబరుస్తున్నారు.

వియత్నాంలో సరికొత్త గరిష్టాలు

మరోవైపు, వియత్నాం ఎగుమతి మార్కెట్లోనూ ఇదే రకమైన ట్రెండ్ కనిపిస్తోంది. వియత్నాంకు చెందిన 5% బ్రోకెన్ (కఫా) బియ్యం ధరలు గరిష్ట స్థాయిని తాకుతూ గత రెండేళ్లలో ఎన్నడూ లేని ధర పలుకుతుంది. అక్కడి స్థానిక కరెన్సీ ఒత్తిళ్లు, ఎగుమతుల వేగం మందగించడం, అంతర్జాతీయ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వియత్నాం రేట్లు పైకి కదిలాయి.

పండుగ సీజన్‌లో తగ్గిన ఫోన్లు, టీవీల అమ్మకాలు

దుకాణాల్లో పేరుకుపోయిన స్టాక్.. కంపెనీల కీలక నిర్ణయం !!

దసరా, దీపావళి వంటి పెద్ద పండుగల వేళ.. కొత్త మొబైల్ ఫోన్ కొనాలని, ఇంట్లో టీవీ మార్చుకోవాలని చాలామంది భావిస్తుంటారు. ఈ సమయంలో కంపెనీలు కూడా భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తాయి. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. పండగల సీజన్‌లోనూ స్మార్ట్‌ఫోన్లు, టీవీల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో తయారీ సంస్థలు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాయి. రానున్న రెండు మూడు నెలల్లో ఉత్పత్తిని ఎప్పటితో పోలిస్తే 20 శాతం వరకు తగ్గించాలని భావిస్తున్నాయి. మరోవైపు మార్కెట్లో అమ్ముడుపోని స్టాక్ పేరుకుపోవడం కంపెనీలకు కొత్త సవాలుగా మారింది.

20 శాతం వరకు తగ్గనున్న ఉత్పత్తి!

ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. మొబైల్ ఫోన్లు, టీవీల తయారీ సంస్థలు వచ్చే రెండు మూడు నెలల్లో ఉత్పత్తిని ప్రణాళికాబద్ధమైన స్థాయితో పోలిస్తే 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. ఈ పండగ సీజన్‌లో గత ఏడాదితో పోలిస్తే యూనిట్ల వారీగా అమ్మకాలు దాదాపు 25 శాతం పడిపోయినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా పండగల సమయంలో డిమాండ్ భారీగా ఉంటుందనే అంచనాతో కంపెనీలు ముందుగానే పెద్ద మొత్తంలో ఉత్పత్తులను తయారు చేస్తాయి. రిటైల్ దుకాణాలు, ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్‌లకు సరిపడా స్టాక్ పంపిస్తాయి. కానీ ఈసారి వినియోగదారుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఇప్పటికే ఉన్న ఉత్పత్తులే అమ్ముడుపోకుండా మిగిలిపోయాయి. దీంతో కొత్తగా తయారు చేసే ఉత్పత్తుల సంఖ్యను తగ్గించి, పాత స్టాక్‌ను విక్రయించడంపై కంపెనీలు దృష్టి పెట్టనున్నాయి.

పండగల సీజన్‌లో 25 శాతం తగ్గిన అమ్మకాలు

మొబైల్ ఫోన్లు, టీవీల వ్యాపారానికి ఓనం నుంచి దీపావళి వరకు ఉండే సమయం చాలా కీలకం. ఏడాది మొత్తం అమ్మకాల్లో ఈ పండగల సీజన్ వాటా సుమారు 30 శాతంగా ఉంటుందని పరిశ్రమ అంచనా. అలాంటి కీలక సమయంలోనే ఈసారి అమ్మకాలు దాదాపు 25 శాతం తగ్గడం తయారీ సంస్థలను ఆందోళనకు గురిచేస్తోంది.

ఇదే సమయంలో 2026 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కూడా స్మార్ట్‌ఫోన్లు, టీవీల యూనిట్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 10 శాతానికి పైగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. పండగల సీజన్‌లో అమ్మకాలు పెరిగి ఈ నష్టాన్ని భర్తీ చేస్తాయని కంపెనీలు ఆశించాయి. కానీ డిమాండ్ పుంజుకోకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

కస్టమర్లలో ఎందుకు ఆసక్తి తగ్గిపోతుంది?

అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణాల్లో వినియోగదారుల కొనుగోలు ఆసక్తి మందగించడం ఒకటి. దీనికి తోడు మెమరీ చిప్‌ల ధరలు పెరగడం కూడా ప్రభావం చూపుతోంది. చిప్‌ల ధరల పెరుగుదలతో తయారీ వ్యయాలు అధికమవుతున్నాయి. ఫలితంగా కొన్ని మొబైల్ ఫోన్లు, టీవీల ధరలు కూడా పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే నిత్యావసరాలు, ఇతర ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు కొత్త ఫోన్ లేదా టీవీ కొనుగోలును వాయిదా వేస్తున్నారు. దీంతో మార్కెట్లో డిమాండ్ తగ్గి, రిటైలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద అమ్ముడుపోని ఉత్పత్తుల నిల్వలు పెరుగుతున్నాయి.

ఇక ఫోన్లు, టీవీల ధరలు తగ్గుతాయా?

ఉత్పత్తిని తగ్గిస్తున్నాయనే కారణంతో వెంటనే మొబైల్ ఫోన్లు, టీవీల ధరలు పెరుగుతాయని లేదా తగ్గుతాయని చెప్పలేం. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న స్టాక్, వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్, కంపెనీల ధరల విధానంపై ఇది ఆధారపడి ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. అమ్మకాలు ఇలాగే మందకొడిగా కొనసాగితే పాత స్టాక్‌ను విక్రయించేందుకు కంపెనీలు, రిటైలర్లు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

బాస్ సర్‌ప్రైజ్.. ఉద్యోగికి రూ.4 కోట్ల కారు గిఫ్ట్!

ఉద్యోగంలో మంచి పనితీరును కనపరిస్తే.. బాస్ నుంచి ప్రశంసలు లభిస్తాయి, ఇంకా బాగా పనిచేస్తే ప్రమోషన్లు, బోనస్‌లు వస్తాయి. కానీ ఒక ఉద్యోగి తన పనితీరుతో ఏకంగా రూ.కోట్ల విలువైన కారును గిఫ్ట్‌గా అందుకుంటే మాత్రం అది నిజంగా ప్రత్యేకమనే చెప్పాలి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది. దుబాయ్‌కు చెందిన రిచ్‌కీ ప్రాపర్టీస్ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ దబన్ ఓత్మాన్ తమ ఉద్యోగికి ఈ సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. సంస్థలో రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్న నటాలియా చావెజ్‌కు ఖరీదైన కారును గిఫ్ట్‌గా అందించారు. దీనికి కారణం ఆమె సాధించిన అసాధారణ విజయం. గత రెండేళ్లలో నటాలియా ఏకంగా 500 మిలియన్ డాలర్లకు పైగా విలువైన రియల్ ఎస్టేట్ డీల్స్‌ను పూర్తి చేశారు. కంపెనీ మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఈ గిఫ్ట్ అందించారు. ఈ వేడుకలో నటాలియాను 2026 సంవత్సరానికి గాను టాప్ పెర్ఫార్మర్‌గా ప్రకటించారు. దీంతో ఆమె వేదికపైకి వెళ్లి సీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇక అవార్డు తీసుకున్న తర్వాత తిరిగి తన సీటుకు వెళ్లబోతుండగా సీఈఓ ఆమెను ఆపారు. ఇంకా కార్యక్రమం పూర్తికాలేదని, మరో సర్‌ప్రైజ్ ఉందంటూ.. అందరిలో ఆసక్తి పెంచారు. ఆ తర్వాత కౌంట్‌డౌన్ ప్రారంభించి, రిబ్బన్ కటింగ్ ద్వారా కొత్త నీలిరంగు లంబోర్గిని ఉరుస్ కారును ఆమెకు చూపించారు. అంతే.. ఒక్కసారిగా నటాలియా ఆనందంలో మునిగిపోయారు. కేవలం అవార్డు మాత్రమే వస్తుందని భావించిన ఆమెకు ఇంత ఖరీదైన కారు గిఫ్ట్‌గా రావడంతో ఆశ్చర్యపోయారు. లంబోర్గిని ఉరుస్ కారు ధర విషయానికి వస్తే.. దుబాయ్ మార్కెట్లో దీని ధర సుమారు 9 లక్షల నుంచి 15.5 లక్షల ఖూజు దిర్హామ్‌ల మధ్య ఉంటుంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.2.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఉంటుంది. లంబోర్గిని ఉరుస్‌లో 4.0 లీటర్ ట్విన్ టర్బో ఎ8 పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. ఇది 6000 తీజూఎ వద్ద 657 ఎష్ట్రజూ పవర్, 2,300 తీఎజూ వద్ద 850 చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 8-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో లభించే ఈ కారు ఆల్ వీల్ డ్రైవ్ సిస్టమ్ పొందుతుంది. కేవలం 3.5 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. దీని టాప్ స్పీడ్ గంటకు 306 కిలోమీటర్లు.

‘న్యూజిలాండ్ టూర్‌లో మా లక్ష్యం అదే’..

కోచ్ గంభీర్ ప్లాన్స్‌ను బయటపెట్టిన వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ భారత్ 3-0తో కైవసం

మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే లక్ష్యమన్న వరుణ్

గంభీర్ సూచనలను వెల్లడించిన వరుణ్

భారత బ్యాటర్లపై స్పిన్నర్ ప్రశంసలు

తన ఫిట్‌నెస్ మెరుగైందన్న వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను ఇప్పటికే 3-0తో కైవసం చేసుకున్నా.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే తమ లక్ష్యమని భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పష్టం చేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌నూ గెలవాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమకు సూచించారని తెలిపాడు. సిరీస్ గెలిచేశామనే ధీమాతో కాకుండా, మిగిలిన రెండు మ్యాచ్‌లను కూడా కీలకంగా తీసుకుంటామని చెప్పాడు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం నాలుగో టీ20కి ముందు వరుణ్ మాట్లాడాడు. “ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాలని గంభీర్ మొదటే చెప్పారు. అదే మా లక్ష్యం. మిగిలిన రెండు మ్యాచ్‌లను రెండు మ్యాచ్‌ల సిరీస్‌గా భావిస్తున్నాం. ఆ రెండింటిలోనూ గెలవాలి” అని పేర్కొన్నాడు.

వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించింది. భారత బ్యాటర్ల దూకుడును వరుణ్ ప్రశంసించాడు. అంతకుమించిన ప్రదర్శన చేయడం కష్టమేనని, అయితే మరోసారి అదే తరహా ఆటను చూడాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు. చిన్న మైదానాలు, ఇలాంటి పిచ్‌లపై ఆడటానికి భారత బ్యాటర్లు అలవాటు పడటం జట్టుకు కలిసొచ్చిందని అభిప్రాయపడ్డాడు. ఇటీవల గాయంతో ఇబ్బందిపడిన వరుణ్ ప్రస్తుతం తాను మెరుగైన స్థితిలో ఉన్నట్లు తెలిపాడు. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ సందర్భంగా పక్కటెముకల పక్కన కండరాల గాయానికి గురైన అతడు.. ఆసియా క్రీడలతో పాటు జపాన్‌తో జరిగిన ఏకైక టీ20కి దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపికైనా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడలేదు. “ఇప్పుడు చాలా మెరుగ్గా ఉన్నా. ఆడేందుకు సిద్ధంగా ఉన్నా” అని తన ఫిట్‌నెస్‌పై స్పష్టత ఇచ్చాడు. భారత జట్టులో పెరుగుతున్న పోటీ గురించి కూడా వరుణ్ స్పందించాడు. దేశంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నందున జట్టులో చోటు కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని చెప్పాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా విశ్రాంతికే పరిమితం కాకుండా, తనను తాను మెరుగుపరుచుకుంటూ మంచి ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించాలని తెలిపాడు.

ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులు.. బ్యాటింగ్ కోచ్‌గా రాబిన్ ఊతప్ప!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్టార్ క్రికెటర్ రాబిన్ ఊతప్పను తమ కొత్త బ్యాటింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. ఇప్పటివరకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న కీరన్ పొలార్డ్‌కు హెడ్ కోచ్‌గా ప్రమోషన్ లభించడంతో, ఆ స్థానంలోకి ఊతప్పను తీసుకువచ్చింది. గత ఐపీఎల్ 2026 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలు సాధించి తొమ్మిదో స్థానంలో నిలిచిన నేపథ్యంలో ముంబై యాజమాన్యం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టింది. కొన్ని రోజుల క్రితమే శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్‌ను హెడ్ కోచ్‌గా నియమించిన ముంబై, ఇప్పుడు పూర్తిస్థాయిలో కొత్త బృందాన్ని సిద్ధం చేసింది. రాబిన్ ఊతప్ప నియామకాన్ని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ.. “ఆటపై అద్భుతమైన అవగాహన, యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేసే స్పష్టత ఉన్న రాబిన్‌కు తిరిగి స్వాగతం” అని ముంబై ఇండియన్స్ పేర్కొంది. ఊతప్ప 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో ముంబై తరఫున ఆడటం విశేషం. ఈ మార్పుల్లో భాగంగా బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనగన్‌ను, ఫీల్డింగ్ కోచ్‌గా టి. దిలీప్‌ను, డెవలప్‌మెంట్ బౌలింగ్ కోచ్‌గా ధవళ్ కులకర్ణిని నియమించారు. దీంతో హెడ్ కోచ్ పొలార్డ్ నేతృత్వంలో కొత్త కోచింగ్ బృందం ఏర్పడింది. గురువారం నాడు బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్‌లు జట్టును వీడుతున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన ఊతప్ప, తన ఐపీఎల్ కెరీర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లకు

ప్రాతినిధ్యం వహించాడు. 2014లో 660 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు. ఇక కొత్త బౌలింగ్ కోచ్ మెక్‌క్లెనగన్ 2015-2020 మధ్య ముంబై తరఫున ఆడి నాలుగుసార్లు టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ భారత జట్టుతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన భారత జట్టు కోచింగ్ బృందంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. మొత్తంమీద గత సీజన్‌లోని వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని, పాత ఆటగాళ్ల అనుభవాన్ని జోడించి, రాబోయే సీజన్‌లో బలంగా పుంజుకోవాలని ముంబై ఇండియన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

స్పోర్ట్స్

టీమిండియాకు బిగ్ షాక్.. న్యూజిలాండ్ సిరీస్‌కు స్టార్ పేసర్ ఔట్!

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరికొంత సమయం పడుతుందని వెల్లడించింది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాలకు గాయమైంది. అప్పటి నుంచి అతడు కోలుకుంటున్నాడు. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన బౌలింగ్ భారాన్ని తట్టుకునే స్థాయికి ఇంకా చేరుకోలేదు. దీంతో న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో అతడికి అవకాశం లేకుండా పోయింది.

భారత్-ఏ జట్టుతో మ్యాచ్ ప్రాక్టీస్

ప్రసిద్ధ్ కృష్ణ త్వరలోనే భారత్-ఏ జట్టుతో కలవనున్నాడు. న్యూజిలాండ్-ఏతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం ముందుగా ‘రిటర్న్ టు ప్లే’ (ఆర్‌టీపీ) ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ మ్యాచ్ ద్వారా ప్రాక్టీస్ పొందడంతో పాటు టెస్టు సిరీస్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

సిరాజ్, నితీశ్ రెడ్డికి కొత్త బాధ్యతలు

మరో పేసర్ మహమ్మద్ సిరాజ్ అక్టోబర్ 31 నుంచి ప్రారంభమయ్యే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం భారత్-ఏ జట్టుతో చేరనున్నాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మాత్రం నవంబర్ 4న జరిగే తొలి వన్డేలో భారత్ తరఫున ఆడతాడు. ఆ తర్వాత భారత్-ఏ జట్టుతో కలుస్తాడు. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు ఆటగాళ్లను సిద్ధం చేయడంలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు.



రెండు భాగాలుగా విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన'..

తొలిసారి విజయ్‌తో కీర్తి సురేష్ జోడీ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'రణబాలి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ప్రస్తుతం 'రౌడీ జనార్దన' అనే మాస్ రూరల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. 'రాజా వారు రాణి గారు' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో మంచి అంచనాలు ఏర్పడగా.. తాజాగా సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'రౌడీ జనార్దన' సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం మొదలైంది. కథా పరిధి, సినిమాలోని అంశాల నేపథ్యంలో రెండు భాగాలుగా తీసుకొస్తే బాగుంటుందనే అభిప్రాయంతో చిత్ర బృందం ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే ఈ వార్తలపై నిర్మాతలు లేదా దర్శకుడు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల టాలీవుడ్‌లో రెండు భాగాలుగా సినిమాలను విడుదల చేసే విధానం పెరిగింది. కథకు విస్తృతమైన పరిధి ఉన్నప్పుడు, పాత్రలు మరియు కథాంశాలను మరింత వివరంగా చూపించడానికి దర్శకులు ఈ పద్ధతిని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ జోడీపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కీర్తి సురేష్‌కు కథలో ఎలాంటి పాత్ర ఇచ్చారు? విజయ్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది? అనే విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 'రౌడీ జనార్దన'ను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. క్రిస్టో జేవియర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ కథగా ఈ సినిమా రూపొందుతోంది. విజయ్ దేవరకొండ మాస్ ఇమేజ్‌కు తగిన కథ, రవికిరణ్ కోలా దర్శకత్వం, కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించడం ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి.

గోల్డెన్ గ్లామర్‌లో జాన్వీ కపూర్..

కుర్రాళ్లను కట్టిపడేస్తున్న ఫొటోలు

'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

శ్రద్ధా కపూర్ 'ఈతా' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈతా' ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,